**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 41, పేజీలు - 08

గురువారం, ఆగష్టు 6, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## కర్ణాటక కేబినెట్ అలకలు..

# సీఎం రేవంత్‌కు సెగ!

**- కర్ణాటక కేబినెట్ అలకల సీన్‌తో సీఎం రేవంత్ ప్లాన్ బీ**

**- తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొత్త వ్యూహం!?**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గత పార్లమెంట్ సమావేశాల్లో సభలో 2/3 వంతు మెజార్టీ లేదని తెలిసీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)-మహిళా బిల్లుల్ని ప్రవేశపెట్టిన కేంద్రం వాటిని నెగ్గించుకునేందుకు విఫలయత్నం చేసింది. అప్పట్లో విపక్షం ఉమ్మడిగా ఈ బిల్లుల్ని ఓడించడంతో కేంద్రం వెనక్కి తీసుకుంది. తిరిగి ఆయా బిల్లుల్ని మరోసారి పార్లమెంట్ లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న కేంద్రం విపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు కోరింది. దీనికి ఆయన సహజంగానే నో చెప్పేశారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే టీఎంసీ, శివసేన, ఆప్ వంటి విపక్ష పార్టీల

2లో..

## డీలిమిటేషన్ బిల్లుపై రాహుల్ మద్దతు కోరిన కేంద్రం

**- జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు**

**- మూడో వారంలోనూ కొనసాగుతోన్న విపక్షాల ఆందోళనలు**

**- డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గత పార్లమెంట్ సమావేశాల్లో సభలో 2/3 వంతు మెజార్టీ లేదని తెలిసీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)-మహిళా బిల్లుల్ని ప్రవేశపెట్టిన కేంద్రం వాటిని నెగ్గించుకునేందుకు విఫలయత్నం చేసింది. అప్పట్లో విపక్షం ఉమ్మడిగా ఈ బిల్లుల్ని ఓడించడంతో కేంద్రం వెనక్కి తీసుకుంది. తిరిగి ఆయా బిల్లుల్ని మరోసారి పార్లమెంట్ లో ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న కేంద్రం విపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు కోరింది.

2లో..

## పొరుగు రాష్ట్రంతో వివాదాల్లేకుండా

# పరిష్కారం చూపండి

**- కేంద్రానికి రేవంత్ రెడ్డి వినతి**



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఇందులో భాగంగా జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం అయ్యారు. కీలక ప్రతిపాదనలను అందజేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ జలవనరుల ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రత్యేకించి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచే విషయంపై పొరుగున ఉన్న మహారాష్ట్రతో చర్చలు

2లో..

## కేసీఆర్ సీఎంగా ఉంటే ఏపీ ఇంత ధైర్యం చేసేదా.?

**- జీఆర్ఎంబీ అజెండాపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రాజెక్టులకు, నీటి ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,

2లో..

## విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్

**- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం**

**ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు**

**- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి చెందడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈ సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు వివరించినట్లు చెప్పారు. ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు నిధులను సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'వీసీటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా తీసుకొని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ప్రణాళికలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని, సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి

2లో..

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

**- కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది.

2లో..

## హైదరాబాద్ నడిబొడ్డున

# 'వై ఆకారంలో ఫ్లైఓవర్'

**- నాంపల్లి-లక్డీకాపూల్ ట్రాఫిక్‌కు చెక్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలో ట్రాఫిక్ రోజురోజుకూ మరింతగా పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యల్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం నాంపల్లి నుంచి లక్డీకాపూల్‌ను అనుసంధానించే 1.45 కిలోమీటర్ల వై-షేప్ (వై ఆకారం) ఫ్లైఓవర్ ప్రాజెక్టు నివేదికకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించనున్న ఈ మూడు లేన్లు, వన్-వే ఎలివేటెడ్ బ్రిడ్జి అసెంబ్లీ వెనుక భాగంలోని రైల్వే స్థలాల మీదుగా వెళ్తుంది. ఇది భూసేకరణ వివాదాలు లేకుండా నిర్మించనుండటంతో సిటీలో రద్దీ సమయాల్లో వాహనదారులకు సిగ్నల్ రహిత ప్రయాణాన్ని

2లో..

## డయల్ 100 కాదు,

# డయల్ 112

**- ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు**

**- హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ**

**- కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అత్యవసర సేవల వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోలీసు సహాయం కోసం 100, అగ్నిమాపక సేవల కోసం 101, అంబులెన్స్ కోసం 108 వంటి వేర్వేరు నంబర్లకు కాల్ చేయాల్సి వచ్చేది. ఇక నుంచి అలాంటి అవసరం లేకుండా అన్ని రకాల అత్యవసర సేవలకు ఒకే నంబర్ 112ను అందుబాటులోకి వచ్చింది.

2లో..

## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట

**- పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు**



చెన్నై (ప్రశ్న న్యూస్) విజయ్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి తమిళనాడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తమిళనాడు ఆర్థిక మంత్రి మేరీ విల్సన్ బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో ఈసారి తమిళనాడు బడ్జెట్ గురించి కేవలం తమిళ ప్రజలే కాకుండా దక్షిణాది మొత్తం

2లో..

## హైడ్రా కమిషనర్

# సంతకం ఫోర్జరీ

**- హైడ్రా పేరుతో నకిలీ ఎన్‌వోసీల కలకలం**

**- 8 ప్రైవేటు కాలేజీలపై ఫిర్యాదు**

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. అక్రమకట్టడాలకు సరైన నిబంధనలు పాటించిన నిర్మాణాలకు హైడ్రా నోటీసులు పంపుతోంది. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ ఎన్‌వోసీ పత్రాలను తయారు చేసిన ఘటన ప్రస్తుతం కలకలం రేపుతోంది.

2లో..

## అగ్రిగోల్డ్ వ్యవహారంపై

# కూటమి ప్రభుత్వ ఫోకస్

**- సమస్య పరిష్కారానికి డెడ్‌లైన్లు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని లక్షలాది మంది అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే ప్రక్రియను వేగవంతం చేశామని, వారికి తప్పకుండా న్యాయం చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, ఇప్పటికే మూడుసార్లు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించామని తెలిపారు.

2లో..

# కేసీఆర్ సీఎంగా ఉంటే ఏపీ ఇంత ధైర్యం చేసేదా.?

మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఉంటే ఏపీ ప్రభుత్వం ఇంత ధైర్యం చేసేదా అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు పట్ల ఉన్న అభిమానంతోనే రేవంత్ రెడ్డి ఈ రకంగా గురుదక్షిణ చెల్లిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 18న జరగబోయే గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశపు అజెండాను పరిశీలిస్తే, అది కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే సిద్ధం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. అజెండా వచ్చి వారం రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం సోయి లేకపోవడం దారుణం, తెలంగాణ భవిష్యత్తును ఆగం చేసేలా ఈ ఎజెండా ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. తెలంగాణ నీటి అవసరాలను కాలరాస్తూ, ఆంధ్రాకు నీళ్లను తాకట్టు పెట్టేలా వ్యవహరించడం వెనుక రేవంత్ రెడ్డి మౌనానికి తెలంగాణ ఆత్మగౌరవం లేకపోవడమే కారణమా అని ఆయన నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం పెద్దదా లేక జీఆర్ఎంబీ పెద్దదా అని ప్రశ్నించిన హరీష్ రావు, కుక్క తోకను ఆడిస్తుందా లేక తోక కుక్కను ఆడిస్తుందా ? అని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని అనుమతులు మంజూరు చేసిన తెలంగాణలోని 7 ప్రాజెక్టుల అనుమతులపై పునఃసమీక్ష (రివ్యూ) జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించగానే, దాన్ని జీఆర్ఎంబీ తన సమావేశపు అజెండాలో చేర్చడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని అన్నారు. ఇలాంటి అనుచిత ప్రతిపాదనలు అజెండాలోకి వస్తున్నప్పుడు జీఆర్ఎంబీలో ఉన్న తెలంగాణ ఇంజనీర్లు ఎందుకు మౌనంగా ఉన్నారని, వారికి రేవంత్ రెడ్డి పరోక్షంగా సహకరిస్తున్నారా అని హరీష్ రావు ప్రశ్నించారు.

### కేసీఆర్ సీఎంగా ఉంటే ఏపీ ఇంత ధైర్యం చేసేదా..

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంత ధైర్యం చేసేది కాదని, కానీ ఇప్పుడు ఆంధ్రా బంటు ఇక్కడ సీఎంగా ఉన్నారు కాబట్టే వారికి ఇంత ధైర్యం వచ్చిందని హరీష్ రావు ఆరోపించారు. ఆంధ్రా బంటు ఇక్కడ ఉన్నారనే ధైర్యంతోనే జీఆర్ఎంబీ అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులకు గతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలనే ప్రతిపాదనను చేర్చారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఒక అధికారి కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, గతంలో ఏపీ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అధికారి ప్రస్తుతం తెలంగాణలో నీటిపారుదల శాఖ సలహాదారుగా ఉన్నారని గుర్తుచేశారు. అంతేకాకుండా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారే సలహాదారుగా ఉన్నారని, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీగా కూడా ఆంధ్రా కేడర్ అధికారే పనిచేస్తున్నారని హరీష్ రావు పేర్కొన్నారు.

### తెలంగాణ ప్రజల నోటికాడ కూడు లాక్కుంటున్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదని, కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెలంగాణ ప్రజల నోటికాడి బుక్కను లాక్కోవాలని చూస్తున్నారని హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో టీవీల ముందు నిలబడి తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోమని, గోదావరి ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు కేంద్రానికి వరుసగా లేఖలు ఎందుకు రాస్తున్నారని ప్రశ్నించారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశపు అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులకు గతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. తెలంగాణను ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్నామని, నీళ్ల కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని గుర్తుచేశారు. ఆ నీళ్ల విషయంలోనే తెలంగాణకు అన్యాయం జరిగితే ఇక్కడి ప్రజలు ఎంతమాత్రం ఊరుకోరని హెచ్చరించారు.

### తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఏపీ కుట్ర..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంతో శ్రమించి కాళేశ్వరం, సీతారామతో సహా 7 కీలక ప్రాజెక్టులకు అనుమతులు సాధిస్తే, ఇప్పుడు ఆ అనుమతులన్నింటినీ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ ధైర్యంతో ప్రతిపాదనలు చేసిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసి, ఇక్కడి రైతుల నోటికాడ ముక్కను లాక్కోవాలని ఏపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. బోర్డులో రెండు రాష్ట్రాల ఇంజనీర్లు ఉంటారని, జీఆర్ఎంబీలో ఇలాంటి తెలంగాణ వ్యతిరేక ఎజెండా తయారవుతుంటే ఇక్కడి ఇంజనీర్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఒకవేళ అధికారులే ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా, ఆయన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారా అని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కాలంలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాకపోగా, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన అనుమతులు రద్దయ్యే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. నేడు ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే అది ఆనాడు కేసీఆర్ చేసిన కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. అలాగే 47 టీఎంసీల సామర్థ్యం కలిగిన సమ్మక్క సారక్క సాగర్ ప్రాజెక్టును ఏపీ ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడ్డారా అని హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. బెంగళూరు వేదికగా కర్ణాటక, తెలంగాణ నాయకులు కలిసినప్పుడు దీనిపై ఏమైనా ఒప్పందం కుదిరిందా అని అనుమానం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయాంలోనే సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకువచ్చామని, ఈ నీళ్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఉపయోగపడతాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈ 47 టీఎంసీల నీటి కేటాయింపులను ఇచ్చేది లేదని జీఆర్ఎంబీ అజెండాలో ఏపీ ప్రభుత్వం పేర్కొంటుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఎలా వదులుకుంటుందని మండిపడ్డారు. ఈ తీవ్రమైన అంశంపై తెలంగాణ ప్రభుత్వ అధికారిక స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నోరు విప్పి మౌనానికి గల కారణాలను ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

అందించి వారి ఈ నకిలీ పత్రాలను ఆధారంగా చేసుకుని ఎనిమిది ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ పొందేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. సాధారణంగా విద్యాసంస్థలకు గుర్తింపు, అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా అగ్నిమాపక భద్రతా నిబంధనలకు సంబంధించిన అనుమతులు, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ కేసులో హైడ్రా నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నకిలీ ధ్రువపత్రాలను సంబంధిత కాలేజీల యాజమాన్యాలు ఇంటర్మీడియట్ విద్యామండలికి అఫిలియేషన్ కోసం సమర్పించాయి. ధ్రువపత్రాల పరిశీలన సందర్భంగా పత్రాల్లో అనుమానాస్పద అంశాలు కనిపించడంతో ఇంటర్ బోర్డు అధికారులు హైడ్రాను సంప్రదించారు. అనంతరం హైడ్రా అధికారులు రికార్డులను పరిశీలించగా ఆ ఎన్‌వోసీలు తమ కార్యాలయం జారీ చేసినవి కావని, కమిషనర్ సంతకం కూడా నకిలీదేనని నిర్ధారించారు. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన హైడ్రా అధికారులు ఫోర్జరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నకిలీ పత్రాల ఆధారంగా అఫిలియేషన్ పొందేందుకు ప్రయత్నించిన ఎనిమిది ప్రైవేటు జూనియర్ కాలేజీల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఫోర్జరీ, నకిలీ పత్రాల తయారీ, మోసం తదితర కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో నకిలీ ఎన్‌వోసీలను ఎవరు తయారు చేశారు? కాలేజీ యాజమాన్యాలకు ఇందులో ఎంతవరకు పాత్ర ఉంది? ఒకే ముఠా ఈ పత్రాలను రూపొందించిందా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైతే సంబంధిత కాలేజీల యాజమాన్యాలు, మధ్యవర్తులను విచారించి డిజిటల్ ఆధారాలు, పత్రాలను కూడా పరిశీలించనున్నట్లు సమాచారం. ఈ ఘటనతో విద్యాసంస్థల గుర్తింపు ప్రక్రియలో సమర్పించే పత్రాల ధ్రువీకరణ వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని అనుమతి పత్రాలను డిజిటల్ వెరిఫికేషన్ ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది.

# అగ్రిగోల్డ్ వ్యవహారంపై కూటమి ప్రభుత్వ ఫోకస్

అగ్రిగోల్డ్ బాధితులు నిజమైన బాధితులని పేర్కొన్న మంత్రి, వారి సమస్య పరిష్కారానికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్‌కు సంబంధించి సుమారు 20,000 ఎకరాల భూములు ఉండగా, ఇందులో 6,000 ఎకరాలకు పైగా భూములు వెంటనే వేలం వేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ వేలం ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని సీఐడీ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. చరాస్తుల విషయంలో కూడా పోలీసులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. అగ్రిగోల్డ్ సంస్థ తరఫున సుమారు 5 లక్షల మంది ఏజెంట్లు పనిచేసి, దాదాపు రూ. 6,000 కోట్ల డిపాజిట్లు సేకరించారని, ఇందులో రూ. 3,000 కోట్లు ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. మొత్తం 18,57,290 మందికి ప్లాట్లు ఇస్తామన్న హామీతో ఈ డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు పారదర్శకంగా అందుబాటులో ఉంచేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. మొత్తం తొమ్మిది రాష్ట్రాల్లో ఏజెంట్లు పనిచేసినందున, ఆయా రాష్ట్రాల్లో బాండ్ల సేకరణ కోసం పోలీసులతో ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి మనోహర్ వివరించారు. సెప్టెంబర్ 15 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఆగస్టు 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశం జరగనుందని, ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఆగస్టు 15 నాటికి ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేలానికి సంబంధించిన విధివిధానాలను కూడా త్వరలోనే ఖరారు చేసి, దశలవారీగా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# డీలిమిటేషన్ బిల్లుపై రాహుల్ మద్దతు కోరిన కేంద్రం

ఎంపీల్ని చీల్చి తమవైపుకు తిప్పుకున్న కేంద్రం ఇప్పుడు రాహుల్ గాంధీ మద్దతు కోరింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాహుల్ గాంధీతో భేటీ అయి రెండు గంటల పాటు చర్చలు జరిపారు. కేంద్రం ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా ఈ బిల్లుల్ని ప్రవేశపెట్టి ఆమోదించేందుకు ప్రయత్నిస్తుందని, విపక్షం మద్దతు కావాలని కోరారు. అయితే రాహుల్ గాంధీ మాత్రం అంతకు ముందే రామమందిర విరాళాల చోరీ, జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులపై జరిగిన దాడులపై సభలో చర్చలు జరపాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచీ ఇవే అంశాలపై ఉభయసభల్లోనూ విపక్షాలు చర్చకు పట్టుబడుతున్నాయి. ముఖ్యంగా జంతర్ మంతర్ నిరసనలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లులు కూడా ఈ సమావేశాల్లోనే పెడితే ఆమోదం కష్టమని భావించిన కేంద్రం, ఇందుకోసం ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయబోతోంది. జూలై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి, లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తి కాలేదు. ఈ గందరగోళం మధ్య ఐదు బిల్లులు చర్చ లేకుండానే ఆమోదించారు

డీలిమిటేషన్ బిల్లుపై రాహుల్ మద్దతు కోరిన కేంద్రం

దీనికి ఆయన సహజంగానే నో చెప్పేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే టీఎంసీ, శివసేన, ఆప్ వంటి విపక్ష పార్టీల ఎంపీల్ని చీల్చి తమవైపుకు తిప్పుకున్న కేంద్రం ఇప్పుడు రాహుల్ గాంధీ మద్దతు కోరింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాహుల్ గాంధీతో భేటీ అయి రెండు గంటల పాటు చర్చలు జరిపారు. కేంద్రం ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా ఈ బిల్లుల్ని ప్రవేశపెట్టి ఆమోదించేందుకు ప్రయత్నిస్తుందని, విపక్షం మద్దతు కావాలని కోరారు. అయితే రాహుల్ గాంధీ మాత్రం అంతకు ముందే రామమందిర విరాళాల చోరీ, జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులపై జరిగిన దాడులపై సభలో చర్చలు జరపాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచీ ఇవే అంశాలపై ఉభయసభల్లోనూ విపక్షాలు చర్చకు పట్టుబడుతున్నాయి. ముఖ్యంగా జంతర్ మంతర్ నిరసనలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లులు కూడా ఈ సమావేశాల్లోనే పెడితే ఆమోదం కష్టమని భావించిన కేంద్రం, ఇందుకోసం ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయబోతోంది. జూలై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి, లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తి కాలేదు. ఈ గందరగోళం మధ్య ఐదు బిల్లులు చర్చ లేకుండానే ఆమోదించారు.

## పొరుగు రాష్ట్రంతో వివాదాల్లేకుండా

# పరిష్కారం చూపండి

జరిపాలని, దీనికోసం మధ్యవర్తిత్వం వహించాలని కోరారు. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణకు చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు కూడా పాల్గొన్నారు. సరిహద్దుల్లో ఉన్న ఈ అంతరాష్ట్ర ప్రాజెక్టు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తే, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో లక్షలాది హెక్టార్ల పంటకు సాగునీరు అంతుందని, తాగునీటి సమస్య తీరుతుందని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంచితే అన్ని రకాలుగా మేలు కలుగుతుందని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు. ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు విషయంలో కొంతకాలంగా మహారాష్ట్రతో వివాదం కొనసాగుతోంది. ముంపు సమస్యల కారణంగా మహారాష్ట్ర దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో గత ప్రభుత్వాల కాలంలో ఈ ప్రాజెక్టు ఎత్తును తగ్గించే ప్రయత్నాలు జరిగాయి. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం ఎత్తును పెంచితేనే గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేసుకుని, ఉత్తర తెలంగాణ ప్రాంత రైతాంగ ప్రయోజనాలను కాపాడటం సాధ్యమవుతుందని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఈ సుదీర్ఘ ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని రేవంత్ రెడ్డి కోరారు. ఇరు పక్షాల ప్రతినిధులు ఒకే వేదికపై కూర్చుని చర్చించుకునేందుకు వీలుగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తగిన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. కేంద్రం చొరవ చూపితేనే ఈ సంక్లిష్ట సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇతర పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల అనుమతుల గురించి కూడా కేంద్ర మంత్రికి వివరించారు. ఈ విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించిన సీఆర్ పాటిల్, త్వరలోనే సమస్యల పరిష్కారానికి, తదుపరి చర్చలకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

# సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట



ఆసక్తి కనబర్చింది. వచ్చే ఐదేళ్లలో అంటే 2031 నాటికి తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చడానికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తమిళనాడు జీఎస్‌డీపీ దాదాపు 370 బిలియన్ డాలర్లు కాగా.. 2025-26లో ఇది 490 బిలియన్ డాలర్లు దాటిందనే అంచనాలు ఉన్నాయి. వచ్చే నాలుగైదేళ్లలో ఇది 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరాలంటే తమిళనాడు ఆర్థిక వ్యవస్థ ఏటా 20 శాతానికిపైగా వృద్ధిరేటును కనబర్చాల్సి ఉంటుంది. ఈసారి తమిళనాడు బడ్జెట్లో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం దక్కింది. పాఠశాల విద్యాశాఖకు రూ.44,527 కోట్లు కేటాయించగా.. ఉన్నత విద్యాశాఖకు రూ.8393 కోట్లు కేటాయించారు. కాలేజీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించే వెట్రి లాప్‌టాప్ పథకానికి రూ.2 వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 11వ తరగతి చదువుతున్న 5 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఉచిత సైకిళ్లతోపాటు హెల్మెట్, వాటర్ బాటిల్ అందించడానికి రూ.277 కోట్లు కేటాయించారు. తమిళనాడులోని 3734 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ కోసం రూ.2132 కోట్లు అవసరమని అంచనా వేయగా ఈసారి బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించారు. సూపర్ క్లీన్, సూపర్ క్యాంపస్ పథకం కోసం రూ.139 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా బడుల్లో 24 గంటల సెక్యూరిటీతోపాటు రెస్ట్ రూమ్‌లు, తాగునీటి సదుపాయం కల్పిస్తారు. ఇంటర్ మార్కుల ఆధారంగా మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు ఇవ్వాలని తమిళనాడు ఆర్థిక మంత్రి కేంద్రాన్ని కోరారు. మదురైలో స్పెషల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని, రూ.90 కోట్లతో రాష్ట్రంలో కొత్తగా ఐదు ఐటీఐలు ఏర్పాటు చేస్తామని బడ్జెట్ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఈ బడ్జెట్లో ఆరోగ్య శాఖకు రూ.23,357 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు రూ.9818 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.4880 కోట్లు కేటాయించారు. గత ఐదేళ్లలో తమిళనాడు అప్పులు రెట్టింపు అయ్యాయని ఆర్థిక మంత్రి తెలిపారు. అప్పుల నుంచి బయటపడేందుకు జవాబుదారీతనంతో కూడిన టెండరింగ్ విధానం వైపు తమ ప్రభుత్వం మళ్లిందన్నారు. గతంలో నచ్చిన సంస్థలు, రాజకీయ అనుబంధ వర్గాలకే కాంట్రాక్టులు ఇచ్చేవారని, ఈ పరిస్థితి తమ ప్రభుత్వం మార్చిందన్నారు. మద్యంపై ప్రత్యేక సుంకాలు విధించడం ద్వారా వెయ్యి కోట్ల రూపాయల అదనపు ఆదాయం ఖజానాకు చేరుతుందని తమిళనాడు ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### శాఖలు, అంశాల వారీగా కేటాయింపులు:

ఆరోగ్య శాఖ: రూ.23,357 కోట్లు, హోం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్: రూ.17,290 కోట్లు వ్యవసాయ శాఖ: రూ.14,984 కోట్లు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ: రూ.11,532 కోట్లు పర్యావరణం, అటవీ శాఖ: రూ.1762 కోట్లు జలవనరుల శాఖ: రూ.9264 కోట్లు రవాణా శాఖ: రూ.13,561 కోట్లు మున్సిపల్ శాఖ: రూ.29,863 కోట్లు విద్యుత్ శాఖ: రూ.15,828 కోట్లు గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి: రూ.8852 కోట్లు పరిశ్రమల శాఖ: రూ.4414 కోట్లు జౌళి, చేనేత: రూ.1678 కోట్లు ఎంఎస్ఎంఈ: రూ.2142 కోట్లు సహకార శాఖ: రూ.8028 కోట్లు సాంఘిక సంక్షేమ శాఖ: రూ.9818 కోట్లు సింగప్పయాన్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్: రూ.354 కోట్లు సోషల్ జస్టిస్ డిపార్ట్‌మెంట్: రూ.3937 కోట్లు ప్రభుత్వ హాస్పిటల్లో జన్మించే శిశువులకు గ్రాము బంగారు ఉంగరం కోసం: రూ.560 కోట్లు నవ వధువులకు 8 గ్రాముల బంగారం, పట్టు చీర కోసం: రూ.812 కోట్లు

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్

రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించాలన్నది ఆయన సూచన. సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల పరస్పర అనుసంధానం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఈ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడం ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి నమ్మకంగా చెప్పారు. ఈ ప్రణాళిక అమలు చేయడం ద్వారా విశాఖ రీజియన్ కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాకుండా, సమగ్ర అభివృద్ధి సాధించడానికి కూడా దోహదం చేస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, మరియు పర్యావరణ సురక్షణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా, ఈ ప్రణాళిక ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలు, వాణిజ్యం, మరియు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విశాఖ రీజియన్ అభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి నిరూపించింది.

# హైదరాబాద్ నడిబొడ్డున 'వై ఆకారంలో ఫ్లైఓవర్'

సమయాన్ని సేవ్ చేస్తుంది.

### పబ్లిక్ గార్డెన్స్ నుంచి లక్డీకాపూల్ వరకు..

ఈ ఫ్లైఓవర్ డిజైన్ ప్రకారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ సమీపంలో ప్రారంభమవుతుంది. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ దాటుకుంటూ అసెంబ్లీ వెనుక భాగంలో ఉన్న రైలు పట్టాలకు సమాంతరంగా ఈ లైన్ వెళ్తుంది. లక్డీకాపూల్ వద్దకు రాగానే ఇది వై-షేప్‌గా విడిపోతుంది. ఒక వైపు మాసబ్ ట్యాంక్ వైపు ఉన్న ప్రస్తుత ఫ్లై ఓవర్‌ను అనుసంధానించనుండగా, రెండో వైపు ఖైరతాబాద్ వైపు వెళ్లే రూట్ వస్తుంది. వన్-వే మార్గంలో సాగే ఈ ఫ్లైఓవర్ ద్వారా వాహనదారులు అత్యంత రద్దీగా ఉండే 3 జంక్షన్లను ఈజీగా దాటవచ్చు.

### భూ సేకరణ టెన్షన్ అక్కర్లేదు

ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత ఏంటంటే, ఈ మార్గంలో దాదాపు 99 శాతం నిర్మాణం ప్రభుత్వ, రైల్వే భూముల్లోనే జరుగుతుంది. అసెంబ్లీ బిల్డింగ్ వెనుక వైపు నుంచి మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా ప్రైవేట్ ఆస్తుల సేకరణను హెచ్ఎమ్‌డీఏ (హెచ్ఎండీఏ) పూర్తిగా నివారించింది. దీనివల్ల సుదీర్ఘమైన కోర్టు కేసులు, పరిహారం చెల్లింపుల్లో ఆలస్యం, భూసేకరణ వ్యయాలు తగ్గుతాయి. పనులు ప్రారంభమైన వెంటనే నిర్మాణం వేగంగా పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ సమస్య నుంచి త్వరలోనే ఉపశమనం లభిస్తుంది.

### ఫ్లై ఓవర్ ప్రాజెక్ట్ వివరాలు ఇవే..

**మొత్తం మార్గం పొడవు : 1.450 కిలోమీటర్లు**
**లేన్ కాన్ఫిగరేషన్ : 3-లేన్, వన్-వే ఎలివేటెడ్ మార్గం**
**ప్రారంభ స్థానం: తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి**
**చివరి విభజన స్థానం : లక్డీకాపూల్ జంక్షన్ (వై-స్ప్లిట్)**
**నోడల్ ఏజెన్సీ : హెచ్ఎమ్‌డీఏ**

రోడ్డు నెట్‌వర్క్ మెరుగుపడటంతో పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. రోజువారీ ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉండటంతో నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్ ట్యాంక్ వంటి ప్రాంతాల్లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. ప్రధాన రైల్వే స్టేషన్, వాణిజ్య మార్కెట్లకు దగ్గరగా ఉండటం వల్ల నాంపల్లిలోని 2 బీహెచ్కే, 3 బీహెచ్కే ఫ్లాట్లకు డిమాండ్ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే లక్డీకాపూల్‌లో అందుబాటులో ఉన్న ఫ్లాట్లు వ్యాపార కేంద్రాలకు వెళ్లే వారికి ఎంతో అనుకూలంగా మారనున్నాయి. దీనివల్ల ఈ ప్రాంతాల్లో అద్దె ఆదాయం, ఆస్తుల విలువలు పెరిగే అవకాశం ఉంది. ఈ వై-షేప్ ఫ్లైఓవర్ హైదరాబాద్‌లో ప్రయాణ చిత్రపటాన్ని మార్చనుంది. రద్దీగా ఉండే రోడ్ల నుండి వాహనాలను పైకి మళ్లించడం ద్వారా, విఐపి కదలికలు, అసెంబ్లీ సమావేశాల సమయంలో కూడా హెచ్ఎండీఏ సజావుగా ట్రాఫిక్ సాగేలా చూస్తుంది. దీనివల్ల వాహనదారులకు ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా ఇంధన ఖర్చుల భారం తగ్గనుంది.

# రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# డయల్ 100 కాదు, డయల్ 112




తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) ఆధ్వర్యంలో రూపొందించిన NextGen డయల్ 112 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలు మాత్రమే కాకుండా మహిళల భద్రత, చైల్డ్ హెల్ప్‌లైన్, విపత్తు నిర్వహణ, విద్యుత్, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్ఆర్ఐ సహాయ కేంద్రం వంటి మొత్తం 18 రకాల అత్యవసర సేవలు ఒకే నంబర్ ద్వారా అందుబాటులోకి రానున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. దీంతో ప్రజలు వేర్వేరు హెల్ప్‌లైన్ నంబర్లు గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇక ఈ 112 సర్వీసుల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ప్రజల దగ్గరి నుంచి 112కు కాల్ వచ్చిన వెంటనే ఆ వ్యక్తి ఉన్న ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే అడ్వాన్స్‌డ్ లొకేషన్ టెక్నాలజీ ఈ వ్యవస్థలో ఉంది. దీంతో అత్యంత సమీపంలో ఉన్న పోలీస్, అంబులెన్స్ లేదా ఫైర్ సిబ్బందికి సమాచారం చేర్చుతారు. తక్షణమే వారిని సంఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటారు. గతంలో ఈ రెస్పాన్స్ తీసుకోవడానికి 3, 4 నిమిషాలు పట్టగా ఈ సరికొత్త వ్యవస్థతో సుమారు 2 నిమిషాల్లోనే స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ 112 సర్వీసులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాల్ మేనేజ్‌మెంట్‌ను కూడా ప్రవేశపెట్టారు. కాల్ అందిన వెంటనే ఆపరేటర్లు లైవ్‌లో స్పందించి అవసరమైన విభాగానికి సమాచారాన్ని పంపిస్తారు. భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత టెక్నాలజీ సర్వీసులను కూడా 112 వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలంగాణ పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దేశంలో ఒకే ఎమర్జెన్సీ నంబర్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణలో ఈ వ్యవస్థను మరింత ఆధునికంగా రూపొందించామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నేర నియంత్రణ, ప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందన, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో డయల్ 112 కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు. 365 రోజులు, 24 గంటలు ఈ 112 నంబర్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

## రక్త దానం చేయడం సమాజానికి

# మేలు చెయ్యడం వంటిది

**- పోతారం మాజీ సర్పంచ్... - జాగిరి సదానందం...**




**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని ప్రాంతానికి చెందిన పోతారం మాజీ సర్పంచ్ జాగిరి సదానందం, వెంకీ వెడ్డింగ్ మాల్ అధినేత బొమ్మిడి వెంకటేష్ . లను కరీంనగర్ హాస్పిటల్ లోనీ అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగాసదానంద మాట్లాడుతూ తన మిత్రుల ద్వారా రక్తం అవసరం ఉందని తెలిసిందని వెంటనే స్పందించి కరీంనగర్ లో ఇవ్వడం జరిగిందని. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తదానం చెయ్యాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారిని రక్షించిన వారమవుతామని బాధ్యతగల ప్రతి పౌరుడు ఏదో ఒక సందర్భంలో రక్త దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఈ సందర్భంగా సదానందం ను వెంకటేష్ ను పలువురు అభినందించారు.

## పెద్దకూరపాడులో దంపతులపై

# దుండగుల దాడి

**- పట్టపగలు ఇంట్లోకి ప్రవేశించి మహిళ గొంతు కోసి పరారీ**

పల్నాడు పెదకూరపాడు గ్రామం బుచ్చయ్యపాలెం వెళ్లే రహదారిలోని స్థానిక ఆంజనేయ స్వామి బొమ్మ సెంటర్లో దంపతులపై దుండగులు దాడికి దిగారు. ఇంట్లోకి వచ్చి మహిళ గొంతు కోసి పరారయ్యారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు , అవ్వారు బాల గురవయ్య - అరుణ దంపతులను ఆధార్ కార్డు అడిగారు. ఎవరు మీరంటూ ఆరుణ ప్రశ్నించింది. తరువాత తమతో తెచ్చుకున్న రాడ్డుతో బాల గురవయ్య తలపై మోది, ప్రతిఘటించిన అరుణ(50) గొంతు కోసి పరారయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. బాల గురవయ్య తీవ్రగాయాలతో పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు.

# ఘనంగా బోనాల వేడుకలు

**- కళాకారులతో కలిసి పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్** కరీంనగర్ నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్, నగర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొంటూ, కళాకారులు ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన నిర్వాహకులు, కళాకారులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బందిని అభినందించిన మేయర్, కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దిల్ షుక్ నగర్ రోడ్లపై తెలంగాణ

## 'టైగర్' పేరుతో ఓవర్ స్పీడ్ తో కారు హల్చల్..

**హైదరాబాద్** కారు నెంబర్ పేరే రేవంత్ రెడ్డికారు ను పార్టీ పైన లేదా సీఎం రేవంత్ రెడ్డి పైన రిజిస్టర్ చేశారా..ఒక కారుకు నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతుంటే ట్రాఫిక్ పోలీసులు ఎలా అనుమతిస్తున్నారు.పోలీస్ డిపార్ట్మెంట్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఇలా పేరుతో ఏమైనా ప్రత్యేక అనుమతి ఇచ్చిందా? తెలంగాణ టైగర్ అని రేవంత్ రెడ్డి ఫోటో పెట్టుకుని నెంబర్ ప్లేట్ పై రేవంత్ రెడ్డి పేరుతో హోండా సిటీ కారు. కారు వెనక నుండి అడ్వకేట్ సింబల్..చలాన్లు కట్టకపోతేనే వాహనాలు సీజ్ చేసే పోలీసులు నెంబర్ ప్లేట్ లేదు ఎలా అనుమతి ఇచ్చారుదిల్ షుక్ నగర్ రోడ్లపై దర్శనం ఇచ్చిన ఈ కారు ప్రయాణికుల దృష్టిని ఆకర్షించింది.

# తిరుపతి నగరంలో చీకటి దందా

**- వ్యభిచార గృహంపై పోలీసుల దాడి**

**- ఓ ఆర్గనైజర్ తో ముగ్గురు విటులు అరెస్ట్..**

**- ఇద్దరు మహిళలు హోమ్‌కు తరలింపు**

**తిరుపతి** అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కారం పల్లి సమీపంలోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడులు జరిపారు. పట్టుబడిన వారిలో ఆర్గనైజర్ ఇరువురు మహిళలు, ముగ్గురు విటులు వున్నారు. వారి నుంచి 1500 నగదు,10 కండోమ్ ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణపురం రాజీవ్ నగర్ కు చెందిన ఆర్గనైజర్ ఎం. అలివేలు మంగమ్మ, ఎస్ టి వినగర్ కు చెందిన యు. గోవర్ధన్, . కార్వేటినగరం గోపిశెట్టిపల్లికి చెందిన టి. తిరువేసు నారాయణవనం మండలం అరణ్యకండ్రిక కు చెందిన జి. సాయిబాబు లు అరెస్ట్ చేసారు. వారిని కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తున్నట్లు అలిపిరి సిఐ రామకిషోర్ వెల్లడించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ



**బద్వేలు** బద్వేల్ నియోజకవర్గం, బి. కోడూరు మండలం, ఐత్రంపేట పంచాయతీ, రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన కత్తి కొండయ్యకు అనారోగ్య చికిత్స నిమిత్తం ×ముఖ్యమంత్రి సహాయ నిధి (అఓఖీఈ) ద్వారా మంజూరైన రూ. 1,08,997/- (ఒక లక్ష ఎనిమిది వేల తొమ్మిది వందల తొంభై ఏడు రూపాయలు) విలువైన చెక్కును బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# విశాఖలో విజేతల కర్మాగారం' సింధు అకాడమీతో క్రీడా విప్లవానికి శ్రీకారం




**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను దేశ క్రీడా పటంలో అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీకి బుధవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు కేవలం ఒక క్రీడాకారిణి కాదని, తరతరాల ఛాంపియన్లకు స్ఫూర్తి అని కొనియాడారు. ఈ అకాడమీ ఒక భవన నిర్మాణం మాత్రమే కాదని, దేశ భవిష్యత్ క్రీడా చరిత్రకు బలమైన పునాది అని పేర్కొన్నారు.మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి క్రీడాకారులు తయారవ్వాలంటే ప్రపంచ స్థాయి శిక్షణా కేంద్రాలు అవసరమని చెప్పారు. ఆ దిశగా పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. బ్యాడ్మింటన్‌తో పాటు స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి పలు క్రీడలకు ఈ అకాడమీ కేంద్రంగా మారనుందని వెల్లడించారు.ఒలింపిక్ పతకాలు ఒక్కరోజులో రావని, వాటి వెనుక తల్లిదండ్రుల త్యాగం, కోచ్‌ల అంకితభావం, క్రీడాకారుల కఠోర శ్రమ ఉంటుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. పీవీ సింధు సాధించిన విజయాల వెనుక ఆమె తల్లిదండ్రులు, గురువుల కృషి మరువలేనిదని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పాఠశాలల్లో ప్రవేశపెట్టిన 'నో బ్యాగ్ డే' వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంపొందిస్తున్నామని తెలిపారు.భారతదేశం నలుమూలల నుంచి యువ క్రీడాకారులు శిక్షణ కోసం విశాఖకు వచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ గొప్ప పరిశ్రమలకే కాదు, గొప్ప క్రీడాకారులను తీర్చిదిద్దే రాష్ట్రంగా కూడా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ప్రత్యేక క్రీడా వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా పీవీ సింధు సహకారం ఎంతో కీలకమని మంత్రి అన్నారు. ప్రతి ఆడపిల్ల క్రీడలను వృత్తిగా ఎంచుకునే ధైర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.క్రీడలు కేవలం పతకాలు సాధించే మార్గం మాత్రమే కాదని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే జీవన పాఠశాల అని లోకేష్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని, గెలుపు--ఓటములకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.పీవీ సింధు అకాడమీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ప్రతిభ ఉన్న ఏ క్రీడాకారుడు కూడా అవకాశాల లేమితో వెనుకబడకూడదనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు.

ఈ అకాడమీ ద్వారా వేలాది మంది యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ లభించి, భవిష్యత్‌లో ఒలింపిక్ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించే ఛాంపియన్లు ఇక్కడి నుంచే తయారవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు."ఈ రోజు మనం కేవలం ఒక క్రీడా అకాడమీకి శంకుస్థాపన చేయలేదు... భారతదేశ భావి ఛాంపియన్ల కలలకు, ఆంధ్రప్రదేశ్ క్రీడా భవిష్యత్తుకు శాశ్వత పునాది వేశాం" అంటూ మంత్రి లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# స్థానిక సంస్థలకు సంసిద్ధం కావాలి

**- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై నాయకుల దిశానిర్దేశం**

**- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి పిలుపు**

**- పోరుమామిళ్ల (బి. కోడూరు )**

భారతీయ జనతాపార్టీ ( బీజేపి) బి .కోడూరు మండల కార్యవర్గ సమావేశం రాజుపాలెం గ్రామంలో బిజెపి జిల్లా నాయకులు మున్నెల్లి చిన్నగురయ్య ఇంటి వద్ద మండల సమావేశం ఏర్పాటు చేసిన బీజేపీ శ్రేణులు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ మండల ఇంచార్జ్, ःఒం- 1 బిజీవేముల భాస్కర్ రెడ్డి హాజరై కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం, ప్రత్యేక ధ్రుష్టి సారించింది అని,దీనిలో భాగంగానే బీజేపీ కార్యకర్తలకు,నాయకులకు సమన్వయం చేసి రాబోయే స్థానిక సంస్థలలో ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం మార్గ నిర్దేశం చేశారు.స్థానిక సంస్థలకు పోటీ చేసే పంచాయతీల జాబితాను జిల్లా అధ్యక్షుడికి పంపడం జరుగుతుంది అని తెలిపారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి ప్రజలతో మమేకమై నరేంద్ర మోడీ గారి పన్నెండు ఏళ్ల సుపరిపాలన,పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల్లో బీజేపీ పార్టీ పట్ల నమ్మకాన్ని విశ్వాసాన్ని కలిగించి రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం ప్రతీ కార్యకర్త క్రృషి చేయాలని,రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పొందే విధంగా బీఎల్వోలతో సమన్వయం చేస్తూ పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పోలుబోయిన రవిచంద్ర, ःఒం- 1 బిజీవేముల భాస్కర్ రెడ్డి, కడప జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మున్నెల్లి చిన్నగురయ్య, కడప జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గాజులపల్లి శివారెడ్డి, కడప జిల్లా మహిళా మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ గాజులపల్లి మౌనిక, బి.కోడూరు మండల ఉప అధ్యక్షుడు బోరెడ్డి కేశవ రెడ్డి, కార్యదర్శి రమణ, మహిళా మోర్చా కార్యదర్శి సుభద్ర, కార్యవర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, రవీంద్ర పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి గడ్కారీని కలిసిన బీజేపీ ఎంపీలు

**న్యూ ఢిల్లీ :** కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని తెలంగాణ బీజేపీ ఎంపీల బృందంతో ఎంపి ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కొంపల్లి ఫ్లై ఓవర్, ఉప్పల్ ఫ్లై ఓవర్ నిర్మాణం ఆలస్యం కావడంతో యాక్సిడెంట్స్ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. కాబట్టి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులు గుంతలు లేకుండా చూడాలని నితిన్ గడ్గరీ కి విజ్ఞప్తి చేశారు. పదిరోజుల్లో సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారు ఆదేశాలు జారీ చేశారని ఈటల అన్నారు.

ఈ సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్ ఉన్నారు.

## శ్రీశైలం జలాలను, తాగునీటి కోసం

# భద్రపరచుకోవాలి

**- అధికారులు నీటి భద్రతకు చర్యలు చేపట్టాలి - మంత్రి నిమ్మల**

**అమరావతి** రాయలసీమ త్రాగునీటి అవసరాల కోసం, శ్రీశైలం నుండి నీటి విడుదల అయింది. ఎల్ నినో నేపథ్యంలో, 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను, తాగునీటి కోసం భద్రపరచుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టిఎంసిలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టిఎంసిల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నాం.కృష్ణా జలాల్లో మన ఎపి 63 శాతం వాటాను ప్రథమంగా త్రాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నాం. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్ నినో దృష్ట్యా, ప్రథమ ప్రాధాన్యతగా త్రాగునీటికి విడుదల చేస్తున్నాం. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్స్ త్రాగునీటి అవసరాల కోసం, 13 టిఎంసిలు అవసరం. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు త్రాగునీటి కోసం, 10 టిఎంసిలు రేపటి నుండి విడుదల చేస్తున్నాం. తెలుగుగంగ ద్వారా చెన్నై త్రాగునీటికై 10 టిఎంసిల నీరు విడుదల చెయ్యవలసి ఉంది. నాగార్జున సాగర్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి త్రాగునీటికి 32 టిఎంసిలు అవసరం. వారం, వారం సమీక్ష చేసుకుని ఎల్ నినో విపత్తును ఎదుర్కొనే విధంగా వర్షాలు, వరదలు ఆధారంగా ప్రణాళికాబద్దంగా చర్యలు చేపడతామని అన్నారు.జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నీటి భద్రతకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

## ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో భారీగా చేరికలు



**పెద్దపల్లి** సమిష్టి కృషితోనే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుం దని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ముదిరా జ్ అన్నారు. పట్టణంలోని 25 వ వార్డు నుండి కుక్క చరణ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వంలో బుధవారం భారీగా యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పార్టీ కండువాలు కప్పి స్వాగ తించారు. అనంతరం మాట్లాడుతూ అణగారిన వర్గాలు ఒక్కటిగా నిలబడి తేనే రాజ్యాధికారం మనకు దక్కుతుందన్నారు. పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ టౌన్ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్, కుక్క కనకరాజు, మెహరాజ్, 25వ వార్డు సభ్యులు మాచ ర్ల సాగర్, కుక్క అజయ్, కుక్క ఆదర్శ్, కుక్క శ్రావణ్,పేర్క నరేష్, చిలుక శశికు మార్, ఈర్ల గోపిచంద్ కుక్క రాజు, కుక్క దేవయ్య,కుక్క లక్ష్మయ్య, కుక్క రామస్వామి, ఈర్ల సాయి ప్రసన్న, రామగళ్ల ధనశ్రీ కుక్క జీవన, ఈర్ల నికిత, కుక్క సౌమ్య, చిలుక మల్లిక ఇరుగురాల సుమలత,బొంకూరి నిర్మల, కుక్క విజయ,తుంగపిండి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి

# కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**జయశంకర్ భూపాలపల్లి.**ప్రజల సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ ఉత్తర్వులు (ఉ.వా.ఓబ.ఔనీ.4, తేదీ: 04.08.2026) జారీ చేసింది. ప్రతి వారం సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఓఖఆూ) కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది.నోడల్ అధికారి: ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ (ఓఖఆూ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.అధికారుల హాజరు: తహసీల్దార్, ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, పోలీస్ మరియు ఇతర మండల స్థాయి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, వెంటనే చర్యలు చేపడతారు.డిజిటల్ నమోదు (ఖతీజీతీజీలజీనితి ఖనీతీబిజీశ్రీ): మండల స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఏకీకృత 'ప్రజావాణి పోర్టల్'లో నమోదు చేసి, ఫిర్యాదుదారునికి గ్రీవెన్స్ ఐడీ (ఉతీతివలజీనిఇవ ఎఆ) తో కూడిన రసీదును అందిస్తారు.ప్రాధాన్యత ఉ సౌకర్యాలు: వికలాంగులు, వయోవృద్ధులు, గర్భిణులు మరియు బాలింతలకు అర్జీల సమర్పణలో మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మంచినీరు, కూర్చోవడానికి సీటింగ్, హెల్ప్‌డెస్క్ వంటి ప్రాథమిక సౌకర్యాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తారు.

## గిరిజన గురుకులంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**వికారాబాద్** కుల్కచర్ల మండలం బండవెల్కి చర్ల గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి తారక్ తేజ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు.పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి హుటాహుటిన కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విద్యార్థి సిక్ రూమ్లో తారక్ తేజ్ కు చెందిన పుస్తకాలు, ప్లేటు, సామాగ్రిని తోటి విద్యార్థులు బయటకు విసిరేసి పలుమార్లు ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం. ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా ఇబ్బందులకు గురి చేసిన విద్యార్థులకు సపోర్టు చేయడంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు.తమ కొడుకు ఆత్మహత్యకు ప్రధానోపాధ్యాయుడే ( ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి) కారణమంటూ ఆరోపించారు. తమ కొడుకు ఆత్మహత్య చేసుకున్న సమాచారం ఇవ్వకపోవడం తో కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు ప్రిన్సిపల్ సమాచారం ఇచ్చారని అన్నారు. విద్యార్థి స్వస్థలం షాద్నగర్ మండలం కుల్చర్ల తండాకు చెందినవాడు.

# లిఫ్ట్ ప్రమాదంలో మహిళ మృతి

**రెంగారెడ్డి** చందానగర్ పోలిస్ స్టేషన్ పరిధిలో లిఫ్ట్ లో ప్రమాదంలో మహిళ మృతి చెందింది. చందానగర్ అన్నపూర్ణ ఎన్ క్లేవ్ లోని అపార్ట్మెంట్ లిఫ్ట్ లో మహిళ ఎక్కింది. లిఫ్ట్ లోకి అడుగు పేట్టగానే లిఫ్ట్ కదిలింది. దీంతో కాళ్లు ఇరుక్కోని మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను వెంటనే స్థానికులు హస్పటల్ కు తరలించారు. అప్పటికే మహిళ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫిలింనగర్‌లో బోనాల పండుగ

ఫిలింనగర్ లో బోనాల పండుగ సందర్భంగా ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ ఫిలింనగర్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టిపిసిసి కార్యదర్శి విజయ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు డబ్బు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

## వ్యభిచారం చేస్తున్న యువతులనుంచి

# డబ్బులు వసూలు

**ప్రొద్దుటూరు** వ్యభిచారం చేస్తున్న యువతుల నుంచి డబ్బులు వసూలు చేసిన కానిస్టేబుల్లపై జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ చర్యలు తీసుకున్నారు. ఈ ముగ్గురు ప్రొద్దుటూరులో పని చేస్తున్నారు. ప్రొద్దుటూరు 1-టౌన్ హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సాయిని వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసారు. కొందరు యువతులు తిరుపతి నుంచి ప్రొద్దుటూరు కు వచ్చి వ్యభిచారం చేస్తున్నారని కానిస్టేబుల్స్ కు తెలియటం తో వాళ్ళను బెదిరించి 50,000 రూపాయల డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

## కొత్తపల్లి కేజీబీవీలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం

**కొత్తపల్లి :** మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగంపై కొత్తపల్లి కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ సూచనలతో, ఆత్మకూరు రూరల్ సీఐ శ్రీ సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో, కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శక్తి అవేర్నెస్ బృందం సభ్యులు పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, డబ్ల్యూహెచ్‌జీ సుప్రియ పాల్గొన్నారు.కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణబాయి, మహిళా ఉపాధ్యాయుల సమక్షంలో 235 మంది విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగ విధానం, మహిళల భద్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, 112, 1098, 181, 1930 హెల్ప్‌లైన్ సేవలు, సైబర్ నేరాల నివారణ, ఫేక్ కాల్స్, లింకులు, ఏపీకే ఫైళ్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా ఈవ్‌టీజింగ్‌కు గురైనప్పుడు వెంటనే శక్తి యాప్ లేదా అత్యవసర నంబర్ల ద్వారా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా కానిస్టేబుల్ గడ్డం క్రాంతి కుమార్ ఎన్నిక
- నూతన బృందంతో ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ భేటీ. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం" నూతన ఉపాధ్యక్షులు
- ములుగు జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం.
- ఎస్పీని కలిసిన నూతన బృందం, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామ.



**ములుగు(ప్రశ్న న్యూస్)** జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

### పారదర్శకంగా పనిచేయాలి. ఎస్పీ.

ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ మాట్లాడుతూ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాకుండా, పోలీసు అధికారుల సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి, సేవా నిబద్ధతను మరింత బలోపేతం చేసే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది, అధికారులు ఎదుర్కొనే సమస్యలను బాధ్యతాయుతంగా గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా అసోసియేషన్ బాధ్యతలను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఎస్.ఐ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూఎస్పీ సూచనల మేరకు సిబ్బంది సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మేము కట్టుబడి ఉంటాం. జూనియర్ సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తాం. అసోసియేషన్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంటాం" అని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.ఐ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

### సంక్షేమానికి కృషి చేస్తాం అసోసియేషన్..

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని, పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా తమ వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు.

### నూతన కార్యవర్గ వివరాలు.

అధ్యక్షుడు:గడ్డం క్రాంతి కుమార్ (కానిస్టేబుల్) ఉపాధ్యక్షులు:తాజుద్దీన్ (ఎస్సై), కృష్ణ ప్రసాద్ (ఎస్సై)
కార్యదర్శి:దారం సురేష్ కుమార్ (ఇన్‌స్పెక్టర్) జాయింట్ సెక్రటరీ:పసుపులేటి నరేష్ (హెడ్ కానిస్టేబుల్) ఆర్గనైజింగ్ సెక్రటరీ:విజయ్ (హెడ్ కానిస్టేబుల్) ట్రెజరర్: సర్వేశ్వర్ రావు (కానిస్టేబుల్)
ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు: అనిల్ కుమార్.రాజీవ్, స్వప్న యాదవ్.శోభన్. శంకర్ (కానిస్టేబుళు), తిరుపతి (హెడ్ కానిస్టేబుల్)ఈ కార్యక్రమంలో సీఐ దారం సురేష్, ఎస్సై కృష్ణ ప్రసాద్, ఎస్సై తాజుద్దీన్, అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గడ్డం క్రాంతి, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో దారుణం..తాళాలు వేసిన కేంద్రాలు

- పోషకాహారం అందని చిన్నారులు










**ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్)** చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యానికి అండగా ఉండాల్సిన అంగన్వాడీ వ్యవస్థ ఏటూరునాగారం మండలంలో పూర్తిగా నిర్వీర్యమైంది. ప్రభుత్వం నిధులు కేటాయించినా, క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యం తాండవిస్తోంది. బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ సభలో అంగన్వాడీల పనితీరుపై గ్రామస్తులు, మహిళా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూతపడిన కేంద్రాలు: పలు అంగన్వాడీ కేంద్రాలు తరచూ తాళం వేసి ఉంటున్నాయి. టీచర్ల గైర్హాజరుతో కేవలం ఆయాలే బాధ్యతలు చూస్తున్నారు. పోషకాహారం లేక ఇబ్బందులు: చిన్నారులకు వేడి భోజనం, గుడ్లు, పాలు అందడం లేదు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సరఫరా నిలిచిపోయింది

### అధికారుల నిర్లక్ష్యం

ఐసీడీఎస్ అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారని ఆరోపణ. నియామకాలు, బదిలీలపై సమగ్ర విచారణ కోరుతున్న గ్రామస్తులు

### క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా...

గ్రామస్తుల ప్రకారం ఒక కేంద్రంలో టీచర్ వారం రోజులుగా విధులకు రావడం లేదు. ఆయా మాత్రమే ఇద్దరు చిన్నారులతో కేంద్రాన్ని నడుపుతోంది. పాప్కాపురం గ్రామ కేంద్రంలో టీచర్, ఆయా ఇద్దరూ లేక కేంద్రం పూర్తిగా మూతపడింది. మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ బుధవారం పలు కేంద్రాలను పరిశీలించారు. అనేక కేంద్రాల్లో టీచర్లు లేరు. కొన్ని పూర్తిగా మూసి ఉన్నాయి. చిన్నారులకు అందాల్సిన సేవలు అందడం లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ఐసీడీఎస్ కార్యాలయంలోనూ నిర్లక్ష్యం.

ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేరని, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తల్లిపాల వారోత్సవాలు వంటి కార్యక్రమాలు ఫోటోలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. గతంలో జిల్లా కలెక్టర్ అక్రమ నియామకాలు, బదిలీలను రద్దు చేసినా, తిరిగి నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పలుమార్లు అంగన్వాడీ సేవలు మెరుగుపరచాలని ఆదేశించినా, అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని గ్రామస్తులు అన్నారు.

### వెంటనే చర్యలు తీసుకోవాలి.

జిల్లా యంత్రాంగం స్పందించి, ప్రతి కేంద్రం రోజూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు ఉండాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సభలో దళిత సంఘాల నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ మత విశ్వాసాలపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన రాష్ట్రీయ వానరసేన

## - (టి.వి రమణమూర్తి పై చట్టపర చర్యలకు డిమాండ్)



మలక్‌పేట్ (ప్రశ్న న్యూస్) హైందవ ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలతో పురాణాలు, హిందు ఇతిహాసాలను దూషిస్తు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన టి.వి రమణమూర్తి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో బుధవారం నాడు మలక్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ వానరసేన సేన సభ్యులు మాట్లాడుతు గత నెల 20 వ తేదీన టి.వి. రమణమూర్తి అనే వ్యక్తి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి హిందు సంస్కృతి, సంప్రదాయాలు, మత విశ్వాసాలు, హిందు దేవుళ్లపై అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలతో మాట్లాడుతు ఆదిత్యనాథ్ అనే వ్యక్తి, రాముడికి 200 అడుగుల విగ్రహం పెట్టిస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, 200 కాకుంటే 500 అడుగులు పెట్టుకో, ఆయనే మీ నాయకుడు కాబట్టి నీ ఇష్టం వచ్చినట్లు కానిచ్చుకో అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించిచడం యావత్ హిందూ సమాజాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేసిందని రాష్ట్రీయ వానరసేన సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శించారు. అలాగే శ్రీరాముని పై అభ్యంతరకర వ్యాఖ్యలను ప్రయోగిస్తు శ్రీరామ చంద్రుని జాతి, సభ్యతను అవమానించేలా మాట్లాడుతు, 9 నెలల గర్భంతో ఉన్నటువంటి తన భార్యను, తమ్ముడితో పంపి అడవిలో వదిలిపెట్టి వచ్చేయమని చెప్పగలిగిన మనిషి మీకు దేవుడేలా అవుతాడని తీవ్ర వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు.

అలాగే శ్రీరాముని సంస్కారం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తు ఆయనపై మనసు పడ్డ సూర్పణక్క ముక్కు చెవులు కోయించాడంతో స్త్రీల పట్ల ఆయనలో ఉన్న వివక్ష బయట పడిందని, ప్రస్తుతం సమాజంలో యాసిడ్‌తో దాడి చేసే వాళ్లకి, నీ దేవుడికి ఉన్న తేడా ఏంటని ప్రశ్నించడం హిందు సంస్కృతి సంప్రదాయాలను దెబ్బ తీస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరొక అవతారంలో దేవుడు ఏం చేస్తాడంటే, భర్తలతో పడుకున్న 16,000 మంది ఆడవాళ్లను వేణువు ఊది తీసుకుపోతాడని, ఆడ మనిషి ఇష్ట పడితే ముక్కు చెవులు కోయించే ఇలాంటి వ్యక్తి నీకు దేవుడు ఎలా అయ్యాడు, వీరికి నువ్వు ఎందుకు పూజలు చేస్తున్నావు, ఇలాంటి మతంలో నువ్వు ఎందుకు ఉన్నావు, అంటు తాను గతంలో జ్వాల అనే సంస్థ ప్రారంభ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటు హిందువుల ఆరాధ్య దైవాలైన శ్రీ సీతారామచంద్రున్ని, శ్రీ కృష్ణ భగవానుడి చరిత్రను అనుచిత వ్యాఖ్యలతో అవహేళన చేస్తు హిందు మత విశ్వాసాలను ఉద్దేశ్యపూర్వకంగా వక్రీకరించి కించపరిచే విధంగా మాట్లాడే హక్కును టి.వి రమణమూర్తికి ఎవరిచ్చారని ప్రశ్నిస్తు హిందు ధర్మం, సంస్కృతి సంప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రమణమూర్తి పై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని లేదా రమణమూర్తిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తు, హిందు ధర్మం, భక్తి, సంస్కృతి సంప్రదాయా, విశ్వాసాలను కాపాడాలని లేని పక్షంలో రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టేలా ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరముందని హెచ్చరించారు.

## ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా

# ఎరువుల విక్రయాలు

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ ఎఫ్ ఎస్ (ఖీతీుఎవషశీతీని టశీతీ ఖీవతీఅశ్రీఱఓవతీ ఝఖ్రీవ) యాప్ ద్వారానే అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించబడతాయనీ,రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో, పారదర్శకంగా అందించడంతో పాటు ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఖీతీుఎవషశీతీని టశీతీ ఖీవతీఅశ్రీఱఓవతీ ఝఖ్రీవ (ఖీఖీూ) అనే నూతన డిజిటల్ ప్లాట్ఫారమ్ (యాప్)ను దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఎరువుల కొనుగోలు, పంపిణీ, నిల్వలు, సబ్సిడీ, విక్రయాల పర్యవేక్షణ తదితర ప్రక్రియలన్నీ ఒకే వేదికపై నిర్వహించబడనున్నాయనీ తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా ప్రధానంగా యూరియా విక్రయాలు మాత్రమే నమోదు చేయబడేవి, ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఖీఖీూ వ్యవస్థలో యూరియా, డీఏపీ (ణూూ), ఎంఓపీ (వీూూ), ఎన్పీకే (చీూఖ) కాంప్లెక్స్ ఎరువులు సహా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా నిర్వహించబడతాయన్నారు. ఖీఖీూ యాప్ వ్యవస్థ వల్ల ఎరువుల పంపిణీలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావడం,రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడడము,ఎరువుల నిల్వలు, విక్రయాలు, సబ్సిడీ ప్రక్రియలను పర్యవేక్షించడం,ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ను నియంత్రించడం,కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ సరైన లబ్ధిదారులకు చేరేలా చూడడం, డిజిటల్ రికార్డుల ద్వారా బాధ్యతాయుతమైన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం. జరుగుతుందన్నారు.

### రైతులు ఎరువులు పొందే విధానం

రైతులు ముందుగా తమ మొబైల్ నంబర్ మరియు అవసరమైన వివరాలతో ఖీఖీూ యాప్లో నమోదు చేసుకోవాలి. అనంతరం సాగు పంట, విస్తీర్ణం, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేసి సమీపంలోని ఎరువుల డీలర్ను ఎంపిక చేసుకోవాలి. అనంతరం ఖీఖీూ యాప్ రైతుకు ప్రత్యేక ళు= కోడ్ను రూపొందిస్తుంది. రైతు ఎంపిక చేసిన డీలర్ వద్దకు వెళ్లి ఆ ళు= కోడ్ను చూపించాలి. డీలర్ ఖీఖీూ యాప్ లేదా ూూూ పరికరం ద్వారా ళు= కోడ్ను స్కాన్ చేసిన తర్వాత రైతు వివరాలు, ఎరువుల వివరాలు ధృవీకరించబడతాయనీ,అనంతరం రైతుకు ఎరువులు అందజేయబడతాయి. విక్రయం పూర్తయిన వెంటనే ఆ సమాచారం కేంద్ర ఖీఖీూ సర్వర్లో నమోదు అవుతుంది. దీంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎరువుల పంపిణీని పక్కగా పర్యవేక్షించగలుగుతాయినీ తెలిపారు.

### రైతులకు కలిగే ప్రయోజనాలు

-ఎరువుల కోసం అనవసరంగా వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందనీ,పారదర్శకమైన పంపిణీ వ్యవస్థ ద్వారా సరైన రైతుకు సరైన ఎరువు అందుతుందన్నారు. ఎరువుల లభ్యతపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంటుంది. సబ్సిడీ ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుంది. ముఖ్య గమనిక05-08-2026 (రేపు) సాయంత్రం 5.00గాపీ వరకు మాత్రమే ప్రస్తుతం అమలులో ఉన్న పాత ఎరువుల విక్రయ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతాయి,06-08-2026 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖీఖీూ (ఖీతీుఎవషశీతీని టశీతీ ఖీవతీఅశ్రీఱఓవతీ ఝఖ్రీవం) యాప్ ద్వారానే అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించబడతాయి. కావున రైతులు ఎలాంటి అపోహలు లేదా సందేహాలకు గురికాకుండా, ఖీఖీూ వ్యవస్థకు సహకరించి ఎరువులు కొనుగోలు చేయాలని కోరుతున్నాము. ఖీఖీూ నమోదు, ళు= కోడ్, ఎరువుల కొనుగోలు విధానం లేదా ఇతర వివరాలపై ఏవైనా సందేహాలు ఉంటే, తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ూజుూ) సంప్రదించగలరనీ,జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఖీఖీూ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ జరిగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నాము. రైతులు ఈ నూతన ఖీఖీూ వ్యవస్థను పూర్తిగా వినియోగించుకొని, ఎరువుల పంపిణీలో పారదర్శకత మరియు సమర్థతను పెంపొందించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా సుమారు 2846 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేసి వినియోగించుకోవాలనీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# వేధింపులపై భయపడొద్దు. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి

## - బాలికల భద్రతపై షీ టీమ్స అవగాహన




**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** మహిళలు, బాలికల భద్రతపై షీ టీమ్స్ సిబ్బంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తూప్రాన్‌లోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సిబ్బంది స్వరూప మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే వేధింపులు, ఇబ్బందులను భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు తదితర సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు. మహిళలు, బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్లకు అధికారికంగా భవనాలను కేటాయించలేదు :ఎల్లంపేట కమిషనర్ కృష్ణారెడ్డి




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కౌన్సిలర్లకు అధికారికంగా భవనాలను కేటాయించలేదని ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కే కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని 9 వార్డు కౌన్సిలర్ రజిత స్థానంలో ఆమె భర్త కూర్చొని కార్యకలాపాలు చేసే ఘటన వైరల్ గా మారింది. ఈ విషయంపై స్థానికులు జిల్లా కలెక్టర్ కు, ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదులు సైతం అందాయి. ఈ ఘటనపై ప్రజాప్రశ్న దినపత్రిక ప్రతినిధి ఎల్లంపేట కమిషనర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా కౌన్సిలర్లకు అధికారికంగా భవనాలు గాని టేబుల్ గాని కుర్చీలను కానీ కేటాయించలేదని తెలిపారు. ప్రస్తుతం వాటి కార్యాలయాలను కౌన్సిలర్లు అనధికారికంగా వాడుకుంటున్నారే తప్ప కౌన్సిలర్లకు అధికారికంగా భవనాలు కేటాయించలేదని కమిషనర్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కౌన్సిలర్లకు అధికారికంగా భవనాలు కేటాయించాలని ఎలాంటి ఉత్తర్వులు లేవని మున్సిపల్ కార్యాలయంలో సమావేశాలు జరుగుతే తప్ప కౌన్సిలర్లకు ఎక్కడ అధికారిక కుర్చీలు కానీ టేబుల్ కానీ కేటాయించలేదని కమిషనర్ పేర్కొన్నారు. ప్రస్తుతం కౌన్సిలర్లు వాడుతున్న వార్డు కార్యాలయాలు అనధికారికంగా వాడుతున్నారని పేర్కొన్నారు.

### ఇంజనీరు ఏ ఈ కి నోటీసులు

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని 11 వ వార్డులో రూ. 30 లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా సాగుతుండడం పై సంబంధిత ఏఈ దుర్గ ప్రసాద్ కు నోటీసులు ఇచ్చినట్లు ఎల్లంపేట కమీషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 11వ వార్డులో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులలో నాణ్యత లేదని ఆరోపణలు వచ్చాయని దీనిపై ఏఈ కి నోటీసులు ఇచ్చామని, ఈ నోటీసులకు మూడు రోజులలో సమాధానం ఇవ్వాలని ఏఈ ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కాంట్రాక్టర్ సైతం ఇస్తామని తెలిపారు.

## శిశువులకు అందించే ఆహారంలో

# తల్లిపాలు శ్రేష్ఠమైనవి

**- మెడిసిటీ హాస్పిటల్ మెడికల్ డాక్టర్ గీత**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఈ నెల 1 నుండి 7 వరకూ విశ్వవ్యాప్తంగా నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అల్వాల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంతో కలసి పిల్లల తల్లులకు, గర్భిణులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన వైద్య నిపుణులతో పాటూ అల్వాల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు పలువురు పిల్లల తల్లులు గర్భిణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా మెడికల్ డైరెక్టర్, మెడిసిటి హాస్పిటల్, డాక్టర్ గీత ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణురాలు మాట్లాడుతూ శిశువుకు అందించే ఆహారంలో తల్లిపాలు అన్నింటి కన్నా శ్రేష్ఠమైనవి, సురక్షితమైనవని అన్నారు. తల్లి పాలివ్వడం ద్వారా తల్లిబిడ్డల మధ్య అనుబంధం గట్టిపడుతుందని అందుకే శిశువుకు తల్లి స్వయంగా పాలివ్వాలని సూచించారు. పీడియాట్రిక్ విభాగం, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హెడ్ డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ తల్లి బిడ్డల మధ్య అనుబంధంతో పాటూ తరాలతరాల అనుబంధం, వారసత్వం కూడా శిశువుకు అందించిన వారవుతామని, ఈ రహస్యాన్ని తల్లులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లి పాలపై ఎలాంటి అపోహలు లేకుండా తల్లులు పిల్లలకు స్వయంగా పాలు పట్టాలని ఆయన సూచించారు. చివరగా అల్వాల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. శ్రీకాంత్ మాట్లాడుతూ తల్లి పాలతో గేదె లేదా ఆవు పాలను పోల్చలేమని అంటూ తల్లి పాలకు డబ్బా పాలు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు.అనంతరం మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన పీజీ విద్యార్థులు తల్లి పాల విశిష్టతను వివరిస్తూ దానిపై ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన స్కిట్ ప్రదర్శించారు . ఈ స్కిట్ ద్వారా కార్యక్రమానికి హాజరైన పిల్లల తల్లులు మరియు గర్భిణీలకు తల్లిపాలు, డబ్బాపాల కు ఉన్న తేడా ను వివరించారు. పిల్లలకు సంప్రదాయ పద్ధతులు పాటిస్తూనే పాలు ఎలా పట్టించాలి , పాటించవలసిన జాగ్రత్తలు మొదలైన వాటిపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమం ద్వారా తమకు ఎంతో అవగాహన , పిల్లలకు తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలు , పిల్లల పెంపకం , పిల్లల ఆరోగ్యం విషయం లో తల్లి పాల విశిష్టత తెలిసిందని కార్యక్రమానికి హాజరైన పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు ఆనందం వ్యక్తం చేశారు .కార్యక్రమానంతరం పిల్లల తల్లులకు , గర్భిణీలకు పండ్లతో పాటూ ప్రత్యేకంగా తయారు చేసిన వేరుశనగ చిక్కిలను మిమ్స్ సిబ్బంది పంపిణీ చేశారు . ఈ కార్యక్రమాలలో మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హెడ్, కమ్యూనిటి మెడిసన్, డాక్టర్ ఈనాక్షి గంగోలి మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ సమీర్ కమ్యూనిటి మెడిసిన్, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డా శ్రీకాంత్, మెడికల్ ఆఫీసర్, అల్వాల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, డా. నాగరాజు, జిల్లా సర్వేలెన్స్ ఆఫీసు వారితో పాటూ మెడికల్ కళాశాలకు చందిన పీజి విద్యార్థులు, వైద్యులు, పిల్లల తల్లులు, గర్భిణి స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్పల్లి జూనియర్ కళాశాలలో సైబర్ దివాస్, మాదక ద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




**ధర్పల్లి(ప్రశ్న న్యూస్ )** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్పల్లి లో సైబర్ దివాస్,ఎన్డీపీఎస్ (మాదక ద్రవ్యాల నివారణ) అవగాహన,ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ధర్పల్లి ఎస్సై సందీప్ విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు చేశారు. సైబర్ నేరాల నుండి ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండే మార్గాలు గురించి వివరించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, యువత జీవితాలపై వాటి ప్రభావం గురించి తెలియజేసి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం,మైనర్లు వాహనాలు నడపకూడదని, రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇన్‌చార్జ్ వరుణ్, లెక్చరర్ మహేష్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, సమాజంలో సైబర్ భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన,రహదారి భద్రత పై అవగాహన కల్పించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

## నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియెంటేషన్ డే



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** స్థానిక గుండ్లపోచంపల్లి పరిధిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో లో నూతనంగా చేరిన విద్యార్థులకు ఓరియెంటేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా విఎస్ యు వైస్-ఛాన్సలర్ ప్రొ. అల్లం శ్రీనివాస రావు, గౌరవ అతిథులు గా క్యాప్‌జెమిని సీనియర్ మేనేజర్ అంకుర్ మిట్టల్ సోషల్ గవర్నెన్స్ అడ్వైజర్ పి ఓ ఎస్ హెచ్ పాలసీ నిపుణులు రోహిణి నాయుడు , ప్రత్యేక ఆహ్వానితులు గా వి. యాక్సిస్ లెర్నింగ్స్ ప్రై. లిమిటెడ్ ఫౌండర్ సీఈవో వికాస్ సురేంద్రన్ మైక్రోసాఫ్ట్ సీనియర్ టెక్నికల్ కన్సల్టెంట్ రజిని ఇంటర్నేషనల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ శ్రీమతి. పారుల్ ఖురానా పోలీస్ డిపార్ట్‌మెంట్, మోటివేషనల్ స్పీకర్, డిజి రామ్ మూర్తి గ్రాడ్‌స్ట్రీట్ సీఈవో కే దుర్గ నవీన్ హాజరయ్యారు. ఇందులో భాగంగా, ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్. అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విలువలతో కూడిన విద్య అవసరమని విద్యార్థులకు సూచించారు, కష్టపడి లక్ష్యాలను సాధించాలని, దేశ నిర్మాణంలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. అనంతరం అంకుర్ మిట్టల్ మాట్లాడుతూ, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను ఇప్పటి నుండే అలవర్చుకోవాలని విద్యార్థులకు సలహా ఇచ్చారు. టీమ్‌వర్క్, అడాప్టబిలిటీ భవిష్యత్ కెరీర్‌కు పునాదులని తెలిపారు. తదనంతరం క్యాంపస్‌లో గౌరవప్రదమైన, సురక్షితమైన వాతావరణం చాలా ముఖ్యమని చెప్పారు. నైతికత, లింగ సమానత్వంతో కూడిన వృత్తిపరమైన వైఖరిని పెంపొందించుకోవాలని రోహిణి నాయుడు సూచించారు.వికాస్ సురేంద్రన్ స్పందిస్తూ, విద్యతో పాటు నైపుణ్యాలు, ఆవిష్కరణలే విజయానికి తాళం అని పేర్కొన్నారు. లెర్నింగ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఏ అవకాశాన్నైనా సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం శ. రజిని కాసల మాట్లాడుతూ, ఏఐ క్లౌడ్ వంటి కొత్త టెక్నాలజీలను నేర్చుకుని ముందుండాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలను పరిష్కరించే నైపుణ్యం ఇంజనీర్‌కు అత్యంత అవసరమని అన్నారు. తదుపరి పారుల్ ఖురానా మాట్లాడుతూ, ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతతతో చదవాలని సలహా ఇచ్చారు. ధ్యానం, సానుకూల ఆలోచనలు విద్యార్థుల జీవితాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. బిజీ రామ్ మూర్త మాట్లాడుతూ, క్రమశిక్షణ, దేశభక్తి ఉన్న యువతే దేశ భవిష్యత్తు అని ప్రసంగించారు. లక్ష్యం పట్ల నిబద్ధతతో ముందుకు సాగితే ఏదైనా సాధ్యమని ఉద్బోధించారు. కె. దుర్గ నవీన్ ప్రసంగిస్తూ, స్టార్టప్ ఆలోచనలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. రిస్క్ తీసుకునే ధైర్యం, నిరంతర ప్రయత్నం విజయానికి దారితీస్తాయని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల అందించే అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, మంచి ఇంజనీర్లుగా, మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.అనంతరం కళాశాల డైరెక్టర్ విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం మాట్లాడుతు, విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ఎన్ ఆర్ సి ఎం లోని ఫ్యాకల్టీ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి , కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి , కోశాధికారి జె త్రిలోక్ రెడ్డి డైరెక్టర్ డా ఏ మోహన్ , కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం , వివిధ విభాగాధిపతులు, నూతన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా 'సైబర్ సురక్ష తిరంగా' వారోత్సవం




**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సైబర్ నేరాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గజ్వేల్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'సైబర్ సురక్ష తిరంగా' వారోత్సవం ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, నేటి సమాజంలో సైబర్ మోసాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రజలకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న గజ్వేల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ మాట్లాడుతూ, డిజిటల్ అరెస్ట్, క్యూఆర్ కోడ్ స్కానింగ్, నకిలీ లింకులు, సోషల్ మీడియా మోసాలు, కంటెంట్ క్రియేషన్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే, 'గోల్డెన్ అవర్'లో స్పందించడం ద్వారా డబ్బు రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు.సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ, గజ్వేల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు జైపాల్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, సైబర్ విభాగం కానిస్టేబుళ్లు విద్యార్థులకు వివిధ రకాల సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సి. హెచ్. రాజారావు మాట్లాడుతూ, యువత డిజిటల్ సాంకేతికతను విజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.గజ్వేల్ పట్టణ పోలీసు శాఖ, గర్ల్స్ హబ్ టీఎస్ మోడల్ స్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సోషల్ సైన్స్ మరియు మహిళా సాధికారత విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు డాక్టర్ బి. మురళీధర్, డాక్టర్ డి. సుజాత, డాక్టర్ ఏ. బాలచంద్రం, డాక్టర్ పి. జయరాజు, నరేష్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆనవాళ్లు ఉండవు

**- వంటేరు ప్రతాప్ రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఆనవాళ్లు కూడా ఉండవని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు.గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రామ్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. హరీష్ రావుకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.33 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రూ.4 లక్షల కోట్ల అప్పు చేసినప్పటికీ ఒక్క కొత్త ప్రాజెక్టును కూడా నిర్మించలేదని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, రైతులకు సాగునీరు, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు క్షుద్ర పూజల అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. విద్యార్థులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, వాటిని రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఖండించాయని తెలిపారు.ప్రపంచం సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏ ఐ) దిశగా పయనిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజకీయ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు.ఈ సమావేశంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మబాయి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యం - ప్రజాసేవే నా మార్గం

- అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన యువ నేత బాడిశ నాగరమేష్
- పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుగా ఉంటాం
- బీఆర్ఎస్ సిద్ధాంతాలకు నిదర్శనంగా పరామర్శ



**మంగపేట(ప్రశ్నన్యూస్)** ప్రజా సేవయే పరమావధిగా, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా భావిస్తూ బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతోంది. ఈ సిద్ధాంతానికి నిదర్శనంగా ములుగు జిల్లా యువ నాయకులు బాడిశ నాగరమేష్ గారు మానవత్వంతో ముందుకొచ్చారు. ములుగు జిల్లా, మంగపేట మండలం రమణక్క పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మంచాల నాగేంద్ర బాబు కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకున్న వెంటనే బాడిశ నాగరమేష్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

### ప్రజల్లోనే నాయకుడు - ప్రజల కోసమే సేవ.

పరామర్శ సందర్భంగా నాగరమేష్ నాగేంద్ర బాబు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, చికిత్సకు అవసరమైన అన్ని విధాలా సహాయం అందిస్తామని మనోధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ అంటే కుటుంబం లాంటిది. కార్యకర్తల కష్టంలో పార్టీ అండగా ఉంటుంది" అని ఆయన అన్నారు.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాల స్ఫూర్తిని కొనసాగిస్తూ, పార్టీ శ్రేణులు కూడా ఒకరికొకరు తోడుగా ఉండాలన్నదే తన లక్ష్యమని నాగరమేష్ గ తెలిపారు. సేవే లక్ష్యం ప్రజాసేవే నా మార్గం అనే సూత్రంతో తాను పని చేస్తున్నానని పేర్కొన్నారు.

### భారీగా పాల్గొన్న కార్యకర్తలు.

ఈ పరామర్శ కార్యక్రమంలో నాగరమేష్ వెంట మండల మాజీ యూత్ అధ్యక్షులు గుమ్మాలా వీరాస్వామి, మండల నాయకులు మాటూరి ఏడుకొండలు, సుధీర్, కొమరం చంటి, పుల్లారావు, సంతోష్, ఇందారపు రమేష్, మహేష్, బన్ను, వీరాస్వామి, వంశీ, నరేష్, సాంబయ్య, రాకేష్, సంపత్, జి. రమేష్, శ్రీను, ప్రశాంత్, లక్ష్మయ్య, ఎల్లేందుల సాంబయ్య, కిరణ్, మధు, రామకృష్ణ తో పాటు సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.బాడిశ నాగరమేష్ ఈ మానవీయ చర్యను గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ప్రశంసించారు. కష్టకాలంలో నాయకుడు ఇలా స్వయంగా వచ్చి పరామర్శించడం బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచుతుందని వారు అన్నారు.ఉద్యమ స్ఫూర్తితో, సంక్షేమే అజెండాగా ముందుకెళ్తున్న బీఆర్ఎస్ పార్టీలో యువ నాయకత్వం ఇలా ప్రజలకు చేరువవుతుండడం శుభపరిణామమని స్థానికులు పేర్కొన్నారు.

## మంథని రైల్వే లైన్‌కు మోక్షం ఎప్పుడు?

- పలువురి రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.
- రామగుండం మణుగూరు రూట్ను హై స్పీడ్ చేయండి.
- రైల్వే నూతన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టండి.
- పెద్దపల్లి మంథని రైల్వే లైన్ ఎప్పుడు ప్రారంభిస్తారు.



**మంథని ( ప్రశ్న న్యూస్)** రైల్వే యంత్రాంగం చేస్తున్న నిర్లక్ష్యం విభ్రాంతి కరమన్నారు... స్వర్గీయ పి వీ ప్రధాని గా ఉన్నప్పుడు పెద్దపల్లి /మంథని రైల్వే నిర్మాణానికి సర్వే జరిగి ఆచరణ ప్రక్రియ కు సంసిద్ధమై ఎందుకో ముందుకు కదల లేదు.... మంథని పాత పెట్రోల్ బంక్ దగ్గర నాలుగు ప్లాట్ ఫాం ల తో కూడిననిర్మాణ అవసరాలను ఆనాటి సర్వే లో విశదీకరించారు...తద్ అనంతరం ప్రజావిన్నాపాలుసౌలభ్యమైన ప్రయాణం దృష్టి..ప్రధనంగా బొగ్గు రవాణా బద్దీకరణ నేపథ్యంలో రామగుండం, మంథని ఎరియా ఓపెన్ కాస్ట్స్,, తాడిచర్ల, భూపాలపల్లి,, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ల ప్రాదేశిక బొగ్గు క్షేత్రాల నిక్షేపాలను రవాణా వ్యవహారం సులభతరమౌతుందని నిపుణుల వెల్లడి... మంథని, కాళేశ్వరం, మేడారం భద్రాచలం... లాంటి పుణ్య క్షేత్రాల సందర్శన కూడ ఈ మర్గం సుగమం చేస్తుందని పలువురి భావన., అన్నింటిక న్న మిన్నగా ముంబై వయా నిజామాబాద్ లను అనుసంధానం గా నిలుస్తుంది..ఇట్టి విశిష్ట ప్రాధాన్యత సంతరించు కున్న ఈనూతన రైల్వే మార్గం లను సత్వరమే పూర్తి చేయాలనీ ఈలోగ సంబందిత ప్రధాన రైల్వే స్టేషన్ ల నిర్మాణాలు ఈ మాసం లో శంకుస్థాపన చేయాలనీ కొండేల మారుతీ కోరారు.

# 'అబ్జెక్షన్ మై లార్డ్' సిరీస్ రివ్యూ!



శ్రీకాంత్ – ముఖేశ్ రిషి ప్రధానమైన పాత్రలను పోషించిన వెబ్ సిరీస్ 'అబ్జెక్షన్ మై లార్డ్'. సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, జులై 31వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది.కోర్టు రూమ్ నేపథ్యంలో నడిచే ఈ కథను 7 ఎపిసోడ్స్ గా అందించారు. గతంలో 'జీ 5' లోనే స్ట్రీమింగ్ జరుపుకున్న తమిళ సిరీస్ 'సట్టముమ్ నీతియుమ్'కి ఇది తెలుగు రీమేక్. తమిళ మూలం మెప్పించిందా? తెలుగు రీమేక్ ఆకట్టుకుందా? అనేది ఇప్పుడు చూద్దాం. పరశురామ్ (శ్రీకాంత్) ఓ లాయర్. కొన్ని కారణాల వలన నల్లకోటు పక్కన పెట్టేసి, కోర్టు ఆవరణలో నోటరీలు రాసుకుంటూ ఉంటాడు. ఆయనలోని నిజాయితీ పరుడిని చాలామంది గౌరవిస్తుంటారు. ఆ నిజాయితీని అర్థం చేసుకోలేనివాళ్లు, సంపాదించుకోవడం చేతకాని అసమర్థుడనే అనుకుంటారు. పరశురామ్ భార్య 'ఇందు'కి ఆయన ఏంటన్నది తెలుసు. అలాగే కూతురు 'కీర్తి' కూడా తండ్రి పరిస్థితిని అర్థం చేసుకుంటుంది. కొడుకు మాత్రం తండ్రి ధోరణి పట్ల అసహనంగా ఉంటాడు. తన కాలేజ్ ఫీజ్ కట్టడానికి కూడా ఇబ్బంది పడుతున్న తండ్రి పట్ల ఒక రకమైన కోపం అది. ఆ కోర్టు ఆవరణలో 'నారాయణ' అనే వ్యక్తి తనని తాను తగలబెట్టుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ సమయంలోనే 'వేద' (అనన్య శర్మ) ఆ కోర్టు ప్రాంగణంలో అడుగుపెడుతుంది. కేసులు వాదించ కూడదని నిర్ణయించుకున్న పరశురామ్ ఆలోచనలో మార్పు తీసుకొస్తుంది. అదే కేసుతో పరశురామ్ దగ్గర జూనియర్ గా చేరుతుంది. చాలా కాలం తరువాత అతను నల్లకోటు వేసుకోవడంతో, అతని సహచరులతో పాటు అందరూ ఆశ్చర్యపోతారు. ముఖ్యంగా సీనియర్ లాయర్ విశ్వనాథ్ (ముఖేశ్ రిషి )కి మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పరశురామ్ కి వ్యతిరేకంగా వాదించడానికి రంగంలోకి దిగింది అతనే. ఈ కేసు వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయనేది పరశురామ్ కి అర్థమైంది కూడా అప్పుడే. నారాయణ తన కూతురు 'సమీరా' (స్నేహాల్) కిడ్నాప్ కి గురైందనీ, ఆ కేసు తీసుకోమని లాయర్లను బ్రతిమాలుకోవడం పరశురామ్ కి తెలుసు. ఒక శ్రీమంతుడి కొడుకు స్నేహితులతో కలిసి తన కూతురును ఎత్తుకెళ్లాడనీ, ఆ కారు నెంబర్ లో ఓ నాలుగు అంకెలు తనకి గుర్తున్నాయని చెప్పడం పరశురామ్ విని ఉన్నాడు. నారాయణకు ఆత్మశాంతి కలగాలంటే, అతని కూతురు సమీరా ఆచూకీ తెలుసుకోవాలనే పట్టుదలతో పరశురామ్ ఉంటాడు. ఎలాంటి పరిస్థితులలోను సమీరా వాళ్లకి దొరక్కూడదని విశ్వనాథ్ భావిస్తాడు. పరశురామ్ చాలాకాలంగా నల్లకోటు పక్కన పెట్టడానికి గల కారణం ఏమిటి? సమీరా ఆచూకీ తెలుసుకునే విషయంలో ఆయన ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంటాడు? సమీరాను కిడ్నాప్ చేసింది ఎవరు? వాళ్లను కాపాడటం కోసం విశ్వనాథ్ చేసే ప్రయత్నం ఫలిస్తుందా? అనేది మిగతా కథ.ఈ కథ అంతా కూడా సమీరా అనే ఒక యువతి చుట్టూ తిరుగుతుంది. కిడ్నాప్ చేయబడిన తన కూతురు సమీరా ఆచూకీ తెలుసుకుని, తనకి న్యాయం చేయమని అభ్యర్థించే ఒక పేద తండ్రి ఆవేదనతో ఈ కథ మొదలవుతుంది. అతని ఆత్మహత్యతో ఈ కథ బలపడుతుంది. తన తెలివి తేటలు .. అనుభవం .. నిజాయితీ, ఒక పేద తండ్రి మరణానికి అర్థం ఉండేలా చేస్తే చాలని భావించి పరశురామ్ రంగంలోకి దిగడంతో కథ పుంజుకుంటుంది. ఇక ఇక్కడి నుంచి పరశురామ్ ఆలోచనలు .. జూనియర్ సంపాదించే ఆధారాలు .. కోర్టులో నడిచే వాదోపవాదాలు .. అజ్ఞాత శత్రువులు పన్నే వ్యూహాలతో ఈ కథ మలుపులు తీసుకుంటూ వెళ్లాలి. మలుపులైతే ఉన్నాయి .. కానీ అవి ఆసక్తికరంగా ఆవిష్కృతం కాకపోవడమే అసంతృప్తిని కలిగిస్తుంది. ఆధారాల కోసం ఒకరు .. అవి దొరక్కుండా చేస్తూ ఒకరు నువ్వా నేనా అన్నట్టుగా పరశురామ్ – విశ్వనాథ్ మధ్య వాదోపవాదాల వార్ నడవాలి .. కానీ అది అంత ఇంట్రెస్టింగ్ గా అనిపించదు. నేను నల్లకోటు వేసుకోను .. కోర్టు మెట్లు ఎక్కనని పరశురామ్ కొన్నేళ్లుగా భీష్మించుకుంటాడు. అందుకు బలమైన కారణమేదో ఉంటుందని భావించిన ఆడియన్స్ కి నిరాశే ఎదురవుతుంది. అలాగే సమీరా మిస్సింగ్ వెనుక ఏదో బలమైన కారణం ఉంటుందని భావించినవారికి కూడా అసంతృప్తియే మిగులుతుంది. ఈ కథలో విలన్ లేడా అంటే .. ఉన్నాడు. కానీ అంతా ముఖేశ్ రిషికి అప్పగించి స్లీపింగ్ పార్ట్నర్ గా కనిపిస్తాడు. సాధారణంగా కోర్టు రూమ్ డ్రామాలలో ఆడియన్స్ ను కదలకుండా చేసే అంశాలు రెండే రెండు. కోర్టు రూమ్ లో ఆసక్తికరంగా నడిచే వాదోపవాదాలు. కోర్టు బయట ఆధారాలు సేకరించే విషయంలో పోటీపడటం.

ఈ రెండు విషయాలలోను ఈ సిరీస్ తన జోరు చూపించలేదేమో అనిపిస్తుంది. కథ ముందుకు వెళుతున్నా కొద్దీ బలపడవలసిందిపోయి, తేలిపోతుంటుంది. తమిళంలో రూపొందిన 'సట్టముమ్ నీతియుమ్' సిరీస్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ సిరీస్ కి ఇది రీమేక్ అయినప్పటికీ, అందులోని ఆత్మ ఇందులో కనిపించదు. అక్కడ కూడా కథాకథనాలు .. కోర్టులో వాదోపవాదాలు నిదానంగానే నడుస్తాయి. అయితే ఆ సిరీస్ లోని సహజత్వం .. ఎమోషన్స్ ను ఆవిష్కరించిన విధానం ఇక్కడ కనిపించదు. అక్కడ సంభాషణలు తక్కువగా ఉన్నప్పటికీ, సన్నివేశాలు బలంగా అనిపిస్తాయి. ఇక్కడ అది లోపించింది. నటన పరంగా శ్రీకాంత్ కీ .. ముఖేశ్ రిషికి వంకబెట్టవలసిన పనిలేదు. అనన్య ..స్నేహాల్ తో పాటు మిగతా వాళ్లంతా బాగానే చేశారు. సూర్య ఫొటోగ్రఫీ .. అరుణ్ చిలువేరు నేపథ్య సంగీతం .. సాయి కిశోర్ ఎడిటింగ్ ఫరవాలేదు. తమిళ మూలంతో పోల్చుకుంటే, 'అబ్జెక్షన్ మై లార్డ్' ఓ మాదిరిగా అనిపిస్తుందంతే.

# నా శరీరాన్ని యంత్రంలా చూశాను

## – గాయంపై స్పందించిన రష్మిక



ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు" అని ఆమె వివరించారు. ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు. "నాకు నేనైతే ఎప్పుడూ బ్రేక్ తీసుకోను కాబట్టి, దేవుడే ఈ రూపంలో నాకు విశ్రాంతి ఇచ్చాడనిపిస్తోంది. నాకు తగిలిన ఈ గాయాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే. ఇది బలవంతపు సెలవు అయినా, నేనేమీ బాధపడటం లేదు. ఈ సమయంలో చాలా పజిల్స్ పూర్తి చేస్తున్నా. వాటిలో నేను ఇంత బాగా ఆడతానని నాకు తెలియదు" అని ఆమె తెలిపారు. వర్కవుట్లు చేయలేకపోవడంపై తన ఆందోళనను కూడా పంచుకున్నారు. "నేను వర్కవుట్లు, రన్నింగ్ బాగా చేయడం వల్లే ఫిట్‌గా ఉంటాను. ఇప్పుడు కొంతకాలం వాటికి దూరంగా ఉండాలి. వర్కవుట్ చేయలేకపోతే నేను తినడం మొదలుపెడతాను. స్వీట్స్ ఎక్కువగా తింటాను. దానివల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఇదే నా అప్‌డేట్. త్వరలోనే మళ్లీ మిమ్మల్ని కలుస్తాను. ఎవరూ కంగారు పడకండి" అంటూ తన అభిమానులకు భరోసా ఇచ్చారు.

### వేధించే వారి అకౌంట్లు

# ట్యాగ్ చేయండి

## – నెటిజన్లకు మృణాల్ ఠాకూర్ పిలుపు



డీప్‌ఫేక్ కంటెంట్‌ను దుర్వినియోగం చేయడంపై ఇటీవలే తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఆన్‌లైన్ వేధింపులపై మరో ముందడుగు వేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయాలని నెటిజన్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు.ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించే, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన లేదా అంగీకారం లేకుండా తీసిన వ్యక్తిగత చిత్రాలను పంచుకునే అకౌంట్ల వివరాలను ట్యాగ్ చేయాలని మృణాల్ కోరారు. "ఇంటర్నెట్‌లోని ఈ మేధావుల కోసం ఓ 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్మిద్దాం. వేధించే ఖాతాలను గుర్తిస్తే, వాటిని ట్యాగ్ చేయండి. ఇలాంటివి డాక్యుమెంట్ చేయడం చాలా అవసరం" అని తన పోస్టులో పేర్కొన్నారు.కొన్ని రోజుల క్రితమే డీప్‌ఫేక్‌పై మృణాల్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. "నా ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టించడం లేదా పంచుకోవడం చట్టవిరుద్ధం, ఆమోదయోగ్యం కాదు. దీన్ని అధికారిక హెచ్చరికగా భావించండి. నా గుర్తింపును ఇంకెవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు.ఇక మృణాల్ కెరీర్ విషయానికొస్తే, ఆమె చివరిగా డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంలో వరుణ్ ధావన్, పూజా హెగ్డేలతో కలిసి నటించారు. ప్రస్తుతం ఆమె సౌత్ ఇండియాలో ఓ భారీ ప్రాజెక్టులో భాగమయ్యారు. అట్లీ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలలో నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఇటీవల విడుదలైన 'రాకా' ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ గుండుతో, తోడేలు పంజా ముఖానికి అడ్డుగా ఉన్న ఇంటెన్స్ లుక్‌లో కనిపించి సినిమాపై అంచనాలను పెంచారు.

# సర్వైవల్ థ్రిల్లర్ చిరంజీవి



కికు యనమల, కశిష్‌ఖాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'చిరంజీవి'. శుభసాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం గ్లింప్స్‌ని విడుదల చేశారు.డెక్స్ట్రోకార్డియా (కుడివైపు గుండె ఉండే అరుదైన పరిస్థితి) అనే వ్యాధితో బాధపడే చిరంజీవి అనే యువకుడి ప్రేమకథ ఇదని, సర్వైవల్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని, కథలోని మలుపులు ఉత్కంఠను పంచుతాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, రచన–దర్శకత్వం: శుభసాయి వెంకట్.

# మాయలేడీ విన్యాసాలు



రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'మాయలేడీ'. ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సాగే లవ్‌స్టోరీ ఇదని, కథానాయిక పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందని, యాక్షన్‌కు కూడా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. గ్లింప్స్ చివరలో 'ఇప్పుడు నా లవ్‌స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తున్నది' అంటూ హీరో చెప్పిన డైలాగ్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. మధుమిత, సర్కార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థ: క్రేజీయాంట్స్ ప్రొడక్షన్స్, రచన–దర్శకత్వం: ప్రశంకర్.

# ఇచ్చి ఇచ్చి పడేద్దాం..



తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కుతున్న విలేజ్ డ్రామా 'పల్లబురుసు'. 'బలగం'ఫేమ్ సుధాకర్ రెడ్డి, మురళీధర్‌గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతిరెడ్డి ప్రధాన పాత్రధారులు. ఉదయ్‌చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. 'ఇచ్చి పడేద్దాం..' అనే పాటను మంగళవారం విడుదల చేశారు. పెళ్లి దావత్, బారాత్ తాలూకు జోష్‌ని ఆవిష్కరిస్తూ ?త ఆద్యంతం హుషారుగా ఈ పాట సాగింది. 'ఇచ్చి ఇచ్చి పడేద్దాం..దావత్ అయినా...బారాత్ అయినా' అంటూ క్యాచీ లిరిక్స్, ఉత్సాహభరితమైన బీట్‌తో ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. పవన్ సిహెచ్ స్వరాల్ని అందించిన ఈ పాటను మనీషా ఈరబత్తిని, నితేష్ అహేర్ ఆలపించారు.



# అది మన చేతుల్లో ఉండదు!

ప్రెగ్నెన్సీ కారణంగా ప్రస్తుతం సినిమాలకు పూర్తిగా బ్రేక్‌నిచ్చి విశ్రాంతి తీసుకుంటున్నది అగ్ర కథానాయిక సమంత. అయితే సోషల్‌మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో అప్‌డేట్స్‌ను పంచుకుంటున్నది. తాజాగా ఈ భామ ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. వీటికి తనదైన తాత్విక ధోరణిలో ఓ క్యాప్షన్‌ను జత చేసింది. 'సమయం ఎల్లప్పుడూ ఒకేలా ఉండదు. కొన్ని సార్లు మనల్ని పోరాటం వైపుకు నడిపిస్తుంది. కొన్నిసార్లు ఓపికతో ఎదురుచూసేలా చేస్తుంది. ఒక్కోసారి కొన్నింటిని వదిలేయాలని సంకేతాల్ని అందిస్తుంది. మనకు ఏ సమయం కావాలో ఎంచుకునే అవకాశం మన చేతుల్లో ఉండదు. అయితే ఏం జరిగినా మనదైన వ్యక్తిత్వంతో ఎలా జీవితంలో ముందుకుసాగుతున్నామన్నదే చాలా ముఖ్యం' అంటూ ఫొటోలకు పెట్టిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇటీవలే 'మా ఇంటి బంగారం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది సమంత. ఈ సినిమా వందకోట్ల వసూళ్లతో ఆమె కెరీర్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చింది.

# టాలీవుడ్ విలన్ ప్రదీప్ రావత్ హఠాన్మరణం



భారత చలనచిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. 'గజినీ' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రతినాయకుడిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. ముంబైలో ఆయన ఈ సాయంత్రం హఠాన్మరణం చెందారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన, మంగళవారం సాయంత్రం గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచినట్టు తెలుస్తోంది. తెలుగులో 'సై', 'ఛత్రపతి' వంటి చిత్రాల్లో పవర్‌ఫుల్ విలన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించిన ఆయన మరణవార్తతో సినీ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. ఆయనకు భార్య కల్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నటి రోష్ని అచ్రేజా ఈ విషయాన్ని ధృవీకరించినట్లు ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. ప్రదీప్ రావత్ మొదట కోకిలాబెన్ ఆసుపత్రిలో, ఆ తర్వాత మరో ఆసుపత్రిలో చికిత్స పొందారని ఆమె తెలిపారు. ఆయన సహనటుడు, 'లగాన్' ఫేమ్ యశ్‌పాల్ శర్మ కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "మా గజినీ, లగాన్ దేవా ఇక లేరు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి" అని భావోద్వేగ పోస్ట్ చేశారు. బీఆర్ చోప్రా రూపొందించిన 'మహాభారత్' సీరియల్‌లో అశ్వత్థామ పాత్రతో ప్రదీప్ రావత్ తన నటన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'సర్ఫరోష్', 'లగాన్' వంటి చిత్రాల్లో ముఖ్యపాత్రలు పోషించారు. అయితే, 2008లో వచ్చిన 'గజినీ' చిత్రంలో పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచి, దేశవ్యాప్తంగా విపరీతమైన కీర్తిని తెచ్చిపెట్టింది. తెలుగు చిత్ర పరిశ్రమలోనూ ప్రదీప్ రావత్ తనదైన ముద్ర వేశారు. 'సై', 'ఛత్రపతి', 'భద్ర', 'లక్ష్మీ', 'దేశముదురు', 'స్టాలిన్' వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల్లో ఆయన విలన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆయన గంభీరమైన రూపం, డైలాగ్ డెలివరీ విలన్ పాత్రలకు ప్రాణం పోశాయి. హిందీ, తెలుగుతో పాటు తమిళ, నేపాలీ భాషల్లోనూ ఆయన నటించారు. ఇటీవల ఒక నేపాలీ సినిమా షూటింగ్‌ను కూడా ఆయన పూర్తి చేసుకున్నారు. ప్రదీప్ రావత్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.

# ప్రపంచాన్ని మరణం నుంచి మళ్లీ బతికించిన మహామేధావి

## ఒక ఫంగస్ ఒక పరిశీలన కోట్లాది ప్రాణాలకు పునర్జన్మ

### - పెన్సిలిన్‌తో వైద్య నాగరికతను మార్చిన సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్

**ప్రత్యేక చారిత్రాత్మక కథనం (ప్రజా ప్రశ్న బ్యూరో వెంకట్)**





1881 ఆగస్టు 6. స్కాట్లాండ్‌లోని అయర్‌షైర్ ప్రాంతంలోని లోచ్‌ఫీల్డ్ అనే చిన్న వ్యవసాయ గ్రామంలో ఓ రైతు కుటుంబంలో జన్మించిన బాలుడు ఒక రోజు ప్రపంచ చరిత్రలో అత్యంత గొప్ప ప్రాణరక్షక ఆవిష్కరణకు నాంది పలుకుతాడని ఎవరూ ఊహించలేదు. ఆ బాలుడే సర్ అలెగ్జాండర్ ఫ్లెమింగ్. యుద్ధాలను గెలిచిన రాజులు చరిత్రలో నిలిచారు. దేశాలను నిర్మించిన నాయకులు చరిత్రలో నిలిచారు. కానీ మరణాన్ని ఓడించి కోట్లాది ప్రాణాలను కాపాడిన శాస్త్రవేత్తగా ఫ్లెమింగ్ మానవ నాగరికతలో శాశ్వత స్థానం సంపాదించాడు. ఒకప్పుడు సాధారణ గాయం కూడా మరణశిక్షతో సమానంగా ఉండేది. చేతికి చిన్న గాటు పడినా ఇన్ఫెక్షన్ సోకి రోజుల్లోనే ప్రాణాలు కోల్పోయేవారు. ప్రసవం తర్వాత మహిళలు, ప్రమాదాల్లో గాయపడినవారు, న్యుమోనియా, సెప్టిసీమియా, మెనింజైటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్యులు చేయగలిగింది చాలా తక్కువ. వైద్య విజ్ఞానం ఉన్నా... ప్రాణాలను కాపాడే ఆయుధం లేదు. ఆ పరిస్థితిని ఒక్క ఆవిష్కరణ శాశ్వతంగా మార్చింది. ఆ ఆయుధమే పెన్సిలిన్. యాదృచ్ఛికం కాదు... పరిశీలనే మహా ఆవిష్కరణకు మూలం 1928లో లండన్‌లోని సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లో బ్యాక్టీరియాలజిస్టుగా పనిచేస్తున్న ఫ్లెమింగ్ సెలవుల అనంతరం తన ప్రయోగశాలకు తిరిగి వచ్చారు. పరిశోధన కోసం ఉంచిన బ్యాక్టీరియా కల్చర్ ప్లేట్లలో ఒకటి ఫంగస్‌తో కలుషితమై కనిపించింది. చాలామంది దానిని చెత్తబుట్టలో పడేసేవారు. కానీ ఫ్లెమింగ్ ఆగాడు. చూశాడు. ఆలోచించాడు. ఫంగస్ చుట్టూ బ్యాక్టీరియా పూర్తిగా నశించాయని గమనించాడు. "ఎందుకు?" అనే ప్రశ్నే ప్రపంచ వైద్య చరిత్రను మార్చింది. ఆ ఫంగస్‌ను ౹ావఅఱఎఱశ్రీశ్రీఱబఎ అశ్ఖీబఎగా గుర్తించి, అది విడుదల చేస్తున్న పదార్థానికి ౹ావఅఱఎఱశ్రీశ్రీఱఅ అని పేరు పెట్టాడు. అది కేవలం ఒక ప్రయోగశాల పరిశీలన కాదు. మానవజాతి జీవితకాలాన్ని పెంచిన విప్లవానికి తొలి అడుగు. ప్రపంచ యుద్ధంలో ప్రాణరక్షక దేవదూత ఫ్లెమింగ్ ఆవిష్కరణను తర్వాత హోవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ బోరిస్ చెయిన్ తదితర శాస్త్రవేత్తలు మరింత అభివృద్ధి చేసి భారీ స్థాయిలో ఉత్పత్తి చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో వేలాది మంది సైనికులు బుల్లెట్ల కంటే ఇన్ఫెక్షన్ల వల్ల మరణిస్తున్నారు. అప్పుడు పెన్సిలిన్ అద్భుతం చేసింది. యుద్ధరంగంలో గాయపడిన సైనికులకు ఈ ఔషధం ప్రాణరక్షకంగా మారింది. అప్పటివరకు మరణం ఖాయమని భావించిన అనేక ఇన్ఫెక్షన్లు పూర్తిగా నయం కావడం ప్రారంభమైంది. ప్రపంచం మొదటిసారి వైద్య విజ్ఞాన శక్తిని ప్రత్యక్షంగా చూసింది. వైద్య చరిత్రను రెండు భాగాలుగా విభజించిన ఔషధం పెన్సిలిన్‌కు ముందు... పెన్సిలిన్ తర్వాత... వైద్య చరిత్రను ఇలా విభజించవచ్చని నిపుణులు చెబుతారు. శస్త్రచికిత్సలు మరింత సురక్షితమయ్యాయి. ప్రసవ మరణాలు తగ్గాయి. చిన్నపిల్లల్లో వచ్చే ప్రమాదకర ఇన్ఫెక్షన్లకు చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, గొంతు వ్యాధులు, గాయాల ఇన్ఫెక్షన్లు, చర్మవ్యాధులు--- అనేక రోగాలకు సమర్థవంతమైన చికిత్స లభించింది. నేటి ఆధునిక వైద్య వ్యవస్థకు పునాది వేసిన మహా ఆవిష్కరణగా పెన్సిలిన్ నిలిచింది. కోట్లాది జీవితాల్లో వెలిగిన ఆశాకిరణం ఆధునిక వైద్యశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే, యాంటీబయాటిక్స్ ఆవిష్కరణ వల్ల కోట్లాది మంది ప్రాణాలు నిలిచాయని అంచనా. ప్రపంచవ్యాప్తంగా సగటు జీవితకాలం పెరగడంలో కూడా యాంటీబయాటిక్స్ కీలక పాత్ర పోషించాయి. అనేక దేశాల్లో శిశు మరణాలు తగ్గాయి. అనారోగ్యంతో మరణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ విజయానికి తొలి అధ్యాయం రాసింది ఫ్లెమింగే. నోబెల్ గౌరవం... ప్రపంచ కృతజ్ఞత 1945లో ఫిజియాలజీ లేదా మెడిసిన్ విభాగంలో నోబెల్ బహుమతిని అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హోవార్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ చెయిన్ సంయుక్తంగా అందుకున్నారు. బ్రిటన్ ప్రభుత్వం ఆయనకు "సర్" బిరుదును ప్రదానం చేసింది. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. కానీ ఫ్లెమింగ్ మాత్రం వినయాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ప్రపంచం వినని హెచ్చరిక... నేడు అతిపెద్ద సవాలు ఫ్లెమింగ్ గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు. భవిష్యత్తును ముందుగానే అంచనా వేసిన దూరదృష్టి గల విజ్ఞాని. యాంటీబయాటిక్స్‌ను విచక్షణారహితంగా వాడితే బ్యాక్టీరియా వాటికి నిరోధకత పెంచుకుంటాయని ఆయన అప్పుడే హెచ్చరించారు. నేడు ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔసూ) చెబుతున్న అత్యంత ప్రమాదకర ఆరోగ్య సమస్యల్లో యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ఒకటి. దశాబ్దాల క్రితమే ఫ్లెమింగ్ చెప్పిన మాటలు నేడు ప్రపంచ ఆరోగ్య విధానాలకు మార్గదర్శకంగా మారాయి. సంపద కాదు... సమాజమే లక్ష్యం ఫ్లెమింగ్ తన ఆవిష్కరణను వ్యక్తిగత వ్యాపారంగా మార్చుకోలేదు. మానవాళి ప్రయోజనమే ఆయనకు ముఖ్యం. పెన్సిలిన్ అందరికీ అందుబాటులోకి రావాలని కోరుకున్నాడు. శాస్త్రం లాభాల కోసం కాదు... జీవితాలను కాపాడేందుకు ఉండాలని నమ్మాడు. అదే ఆయనను ఇతరుల కంటే గొప్పవాడిగా నిలబెట్టింది. శాశ్వతంగా నిలిచిన వారసత్వం 1955 మార్చి 11న ఫ్లెమింగ్ కన్నుమూశారు. కానీ ఆయన ఆలోచన చనిపోలేదు. ప్రపంచంలోని ప్రతి ఆసుపత్రిలో... ప్రతి ఆపరేషన్ థియేటర్‌లో... ప్రతి వైద్య కళాశాలలో... ప్రతి మెడికల్ విద్యార్థి పాఠ్యాంశంలో... ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఒక వైద్యుడు రోగికి యాంటీబయాటిక్ రాస్తున్న ప్రతి సందర్భంలో, తెలియకుండానే ఫ్లెమింగ్ వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడు. చరిత్ర చెప్పే నిజమైన మహానుభావుడు చరిత్రలో యుద్ధాలు చేసినవారు ఎందరో. సామ్రాజ్యాలు నిర్మించినవారు ఎందరో. అధికారాన్ని ప్రదర్శించినవారు ఎందరో. కానీ మరణాన్ని వెనక్కు నెట్టి, మానవ జీవితాన్ని పొడిగించినవారు చాలా అరుదు. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అలాంటి అరుదైన మహానుభావుడు. ఆయన కనుగొన్న పెన్సిలిన్ కేవలం ఒక ఔషధం కాదు... అది మానవజాతికి లభించిన రెండో అవకాశం. ఒక శాస్త్రవేత్త జిజ్ఞాస... ఒక పరిశీలన.. ఒక చిన్న ఫంగస్... ఈ మూడు కలిసి ప్రపంచ వైద్య చరిత్రనే తిరగరాశాయి. అందుకే చరిత్ర అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌ను కేవలం ఒక శాస్త్రవేత్తగా గుర్తించదు. మరణం అంచున నిలిచిన కోట్లాది మంది జీవితాల్లో ఆశను నాటిన మహామానవుడిగా స్మరిస్తుంది. ఆయన జన్మదినం మనకు గుర్తుచేసేది ఒక్కటే--- విజ్ఞానం మానవాళి సేవలో నిలిచినప్పుడు, ఒక శాస్త్రవేత్త ఆవిష్కరణ ప్రపంచ నాగరికతను శాశ్వతంగా మార్చగలదు.

## వీటీపీఎస్ కో-ఆపరేటివ్ స్టోర్‌లో

# అక్రమాలపై ఆరోపణలు

### - సమగ్ర విచారణకు ఉద్యోగుల డిమాండ్




**ఇబ్రహీంపట్నం, ఎన్టీఆర్ జిల్లా(ప్రశ్న న్యూస్)** వీటీపీఎస్ కో-ఆపరేటివ్ సొసైటీ (స్టోర్)లో ఆర్థిక, పరిపాలనా అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ కొందరు ఉద్యోగులు, సభ్యులు నూతన పాలకవర్గానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నట్లు తెలిసింది. ఫిర్యాదు చేసిన ఉద్యోగుల వాదన ప్రకారం, స్టోర్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని చెబుతున్నప్పటికీ, గతంలోనూ ఆయన పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆ సమయంలోనే క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేదే కాదని వారు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా, స్టోర్ పరిపాలనలో అనవసర జోక్యం, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించడం, పరిపాలనా వ్యవస్థపై ప్రభావం చూపేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, నిజానిజాలను తేల్చాలని సభ్యులు కోరుతున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన పాలకవర్గంపై సభ్యులు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. గతంలో జరిగినట్లు చెబుతున్న లోపాలను పక్కనపెట్టి, పూర్తి పారదర్శకతతో వ్యవహరించి స్టోర్ ప్రతిష్ఠను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారెవరైనా సరే, విచారణలో వాస్తవాలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన పాలకవర్గం ఆరోపణలను ఎలా స్వీకరిస్తుంది? స్వతంత్ర విచారణకు ఆదేశిస్తుందా? ఫిర్యాదు చేసిన ఉద్యోగుల వాదనతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి వివరణను కూడా తీసుకుంటుందా? లేక ఈ వ్యవహారం అంతర్గతంగానే ముగుస్తుందా? అనే అంశాలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత ఉద్యోగి స్పందన అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. అలాగే, నూతన పాలకవర్గం కూడా విచారణ చేపట్టిందా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే వాస్తవాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉండనున్నాయని సభ్యులు భావిస్తున్నారు.

# శ్రీశైలం ప్రాజెక్ట్ కు కొనసాగుతున్న వరద నీరు!

### - పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 - నీటిమట్టం 864.05 అడుగులు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)శ్రీశైలం ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం సుంకేసుల,జూరాల నుంచి శ్రీశైలానికి 2,45,183 క్యూసెక్కుల వరద ఇన్ ఫ్లో నమోదు కాగా..ప్రస్తుత నీటిమట్టం 864.05 అడుగులు చేరింది.ప్రాజెక్ట్ ప్రస్తుత నీటి నిల్వ118.6216 టీఎంసీలు కాగా..ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 ఉంది.ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. విద్యుదుత్పత్తి చేసి4,267 క్యూసెక్కులు నీటిని సాగరుకు విడుదల చేశారు.

# అనప్రసాద పథకానికి లక్ష విరళం

### - ధాతకు బాండ్ అంధచేస్తున ఆలయ పర్యవేక్షకులు



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) దేవస్థానం అనాధానం పథకానికి డి.విష్ణు కుమార్ , కృష్ణ జిల్లా, వారు 1,00,116/ బి లను ఆలయ పర్యవేక్షకులు కె.అయ్యన కు అంధజైషారు.దాతకు తగు రాశిధు, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

# హరీష్ రావుపై నిరాధార ఆరోపణలు మానాలి

### - బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎన్.సీ. సంతోష్

**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి హరీష్ రావుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలు వెంటనే మానుకోవాలని గజ్వేల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎన్.సీ. సంతోష్ డిమాండ్ చేశారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని గౌరవిస్తూ దేవాలయాలను సందర్శించడాన్ని క్షుద్ర పూజలుగా చిత్రీకరించడం కాంగ్రెస్ నాయకుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.ఎన్నికల ముందు విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే క్షుద్ర పూజలు, తాంత్రిక ఆరోపణల వంటి అంశాలను తెరపైకి తీసుకొస్తోందని ఆరోపించారు.కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా దేవాలయం వేల ఏళ్ల చరిత్ర కలిగిన పవిత్ర క్షేత్రమని, జగద్గురు ఆదిశంకరాచార్యులతో అనుబంధం ఉన్న ఆ ఆలయాన్ని క్షుద్ర పూజల కేంద్రంగా పేర్కొనడం కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఖండనీయమని పేర్కొన్నారు.ప్రతిరోజూ ప్రజలను కలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడు హరీష్ రావుపై ఇలాంటి ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకుల వివేకహీనతకు నిదర్శనమని ఎన్.సీ. సంతోష్ అన్నారు.మాజీ మంత్రి హరీష్ రావుపై విమర్శలు చేయడం మానేసి, ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



# స్టోర్ లెక్కల్లో మిస్టరీ

### - రూ.16 వేలా… రూ.2 లక్షలా..? - వీటీపీఎస్ కో-ఆపరేటివ్

### - సొసైటీలో ఆరోపణల కలకలం. పూర్తి విచారణ కోరుతున్న సభ్యులు




ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) వీటీపీఎస్ కో-ఆపరేటివ్ సొసైటీ (స్టోర్)లో ఆర్థిక లావాదేవీలపై వినిపిస్తున్న ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. స్టోర్‌లో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపించి వాస్తవాలను సభ్యుల ముందుంచాలని పలువురు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఎన్నికైన కొత్త పాలకవర్గం పారదర్శకంగా వ్యవహరించి నిజానిజాలను వెలికితీయాలని కోరుతున్నారు.సభ్యుల వాదన ప్రకారం, స్టోర్‌లో జరిగిన అవకతవకల విలువ రూ.2 లక్షలకు పైగా ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారికంగా మాత్రం సుమారు రూ.16 వేల మేరకే అక్రమాలు జరిగినట్లు చెబుతున్నారని వారు పేర్కొంటున్నారు. ఈ వ్యత్యాసంపై సభ్యుల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు లెక్కలు ఏమిటి? పూర్తి నష్టం ఎంత? బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే స్వతంత్ర విచారణ తప్పనిసరని వారు అంటున్నారు.కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, గత లావాదేవీలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని సభ్యులు కోరుతున్నారు. నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు--అమ్మకాల వివరాలు, వౌచర్లు, బిల్లులు, బ్యాంకు లావాదేవీలను ప్రత్యేక ఆడిట్‌కు అప్పగించాలని సూచిస్తున్నారు. అవసరమైతే సహకార శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.గతంలో కూడా స్టోర్ వ్యవహారాలపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ, వాటిపై తగిన చర్యలు తీసుకోలేదని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇప్పుడు కొత్త పాలకవర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. సంస్థ ప్రతిష్ఠను కాపాడాలంటే వాస్తవాలను దాచిపెట్టకుండా పారదర్శకంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు.అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కూడా తమ వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలని సభ్యులు అభిప్రాయపడుతున్నారు. పూర్తి విచారణ నివేదికను సభ్యుల ముందుంచి ప్రతి రూపాయి లెక్కను వెల్లడిస్తేనే సంస్థపై విశ్వాసం మరింత బలపడుతుందని వారు చెబుతున్నారు.

## కల్లూరి పవన్ గంగపుత్రను అభినందించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హనుమకొండకు(ప్రశ్న న్యూస్) కల్లూరి పవన్ గంగపుత్ర బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటురి రాజేష్ ఖన్నా గంగపుత్ర పవన్ గంగపుత్రకు అభినందనలు తెలిపారు అనంతరము తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటురి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచు బిసి యువజనుల సాధికారతకు కృషి చేయాలంటూ రాష్ట ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గంగపుత్రులకు అందే విధముగా తన వంతు కృషి చేస్తూ నిరుపేద గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు

# శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై ఎం. భాస్కర్ బాధ్యతలు స్వీకరణ



**శ్రీశైలం( ప్రశ్న న్యూస్)** కర్నూలు జిల్లా దేవనకొండ పోలీస్ విభాగం నుండి బదిలీపై వచ్చిన ఏఎస్సై ఎం. భాస్కర్ మంగళవారం శ్రీశైలం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా విధుల్లో చేరారు.1993 బ్యాచ్‌కు చెందిన ఎం. భాస్కర్‌కు పోలీసు శాఖలో సుదీర్ఘ సర్వీసు అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీశైలం వన్ టౌన్ పరిధిలోని ప్రజలకు సమర్థవంతమైన, సత్వర పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. చట్టబద్ధంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం వన్ టౌన్ ఎస్సై సుబ్బారెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

# వర్షాల కోసం శ్రీశైలంలో 5 రోజుల పాటు వరుణ యాగం.. సహస్ర ఘటాభిషేకం



**శ్రీశైలం (ప్రస్నన్యూస్)** శ్రీశైలం దేవస్థానం రాష్ట్రంలో వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో లోక క్షేమం కోసం శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక వరుణ యాగాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండాలనే సంకల్పంతో ఆగస్టు 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు "వరుణ యాగ సహిత సహస్ర ఘటాభిషేక మహాయాగం" నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు మరియు చైర్మన్ పోటుగుంట రమేష్ నాయుడు సంయుక్తంగా తెలియచేశారు.- ఆగస్టు 7 నుంచి 9 వరకు: వరుణ యాగ క్రతువులు, వేద పండితులతో వేదోక్త పూజలు, హోమాలు నిర్వహిస్తారు. ఇంద్రుడిని, వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రత్యేక మంత్రోచ్చారణలు ఉంటాయి.- ఆగస్టు 10న: ప్రధాన ఘట్టంగా శ్రీ మల్లికార్జున స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం జరుగుతుంది. 1008 కలశాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. అదే రోజు శ్రీ భ్రమరాంబ అమ్మవారికి నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు కూడా నిర్వహిస్తారు.ఆగస్టు 11న: పూర్ణాహుతి, కలశోద్వాసన, మహా మంగళ హారతి మరియు భక్తులకు మహాదాశీర్వాదంతో ఈ మహాయాగం ముగుస్తుంది.దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, "ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైతులు పంటలు వేయడానికి భయపడుతున్నారు. అందుకే లోకంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలనే ఉద్దేశంతో ఈ మహాయాగాన్ని ఏర్పాటు చేశాం" అని ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు.ఈ యాగంలో పాల్గొనేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు, యాగ సంకల్పంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని చైర్మన్ పోటుగుంట రమేష్ నాయుడు సూచించారు.వరుణ యాగం సందర్భంగా శ్రీశైల క్షేత్రం అంతా వేద మంత్రాలతో మారుమోగనుంది. వర్షాల కోసం జరిగే ఈ ప్రత్యేక పూజలతో రాష్ట్రానికి మంచి జరుగుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కల్తీ పన్నీర్ మాఫియాకు హద్దు ఎక్కడ.?

## టన్నుల కొద్దీ కల్తీ పన్నీర్ నగరంలోకి వస్తున్న అధికారుల దాడులు ఉండావా.?

- నాణ్యతపై నిఘా ఎక్కడ.? ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితమా.?
- ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తని ఇన్స్పెక్టర్ కావ్య
- పాలు, తక్కువ పన్నీర్ ఎక్కువ నగరంలోకి ఎక్కడనుండి వస్తుంది.?
- పన్నీర్ మాఫియాకు అడ్డుకట్ట వేసేది ఎవరు.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నగరంలో కల్తీ ఆహార పదార్థాల దందా రోజురోజుకూ జోరుగా విస్తరిస్తున్నా సంబంధిత అధికారుల నిఘా మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పన్నీర్ పేరుతో మార్కెట్లోకి వస్తున్న ఉత్పత్తుల నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగర ప్రజలకు జోరుగా కల్తీ పాలు, పాల ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో టన్నుల కొద్దీ పన్నీర్ ఎక్కడ తయారవుతోంది.? ఎక్కడి నుంచి వస్తోంది.? ఎవరి పర్యవేక్షణలో మార్కెట్లోకి చేరుతోంది.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ప్యాకింగ్ ఎక్కడ.? లేబుల్స్ ఎక్కడ.?

ఇటీవల మార్కెట్ లోని దుకాణాలలో అమ్ముతున్న పన్నీర్ ప్యాకెట్పై తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర బరువు, ధర వంటి వివరాలు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నిబంధనల ప్రకారం స్పష్టంగా ఉండాలి. అయితే ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ నెంబర్ 8 లో బృందావన్ నగర్ వీధి నెంబర్ 2 లో రోడ్ల పక్కన, ఆటోలలోనే పన్నీర్ను ప్యాకింగ్ చేయడానికి చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి, నిబంధనల ప్రకారం కంపెనీ లోపలనే నిబంధన ప్రకారం ప్యాక్ చెయ్యాలి కానీ రోడ్లపైనే రిటైల్ దుకాణాల ముందు, అశుభ్ర వాతావరణంలో ఆటోలలో ప్యాకింగ్ చేస్తుంటే వినియోగదారుల ఆరోగ్యం పరిస్థితి ఏమిటి.?
అంతేకాదు, సరఫరా వ్యవస్థలో జీఎస్టీ బిల్లులు, తయారీ సంస్థ వివరాలు, బ్యాచ్ నంబర్, బరువు, తయారీ,గడువు తేదీలు వంటి అనేక అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారా.? లేక కళ్లముందే జరుగుతున్న వ్యవహారాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫుడ్ ఇన్స్పెక్టర్ల నిఘా ఎక్కడ.?

నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ఫుడ్ సెంటర్లు, సూపర్ మార్కెట్లు, చికెన్,మాంసం దుకాణాలు, పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎంతమేర పనిచేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.ప్రజలు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినప్పుడు ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులు ఫోన్కు స్పందించకపోతే ఫిర్యాదు చేయాల్సింది ఎవరికి.? ఆగస్టు 4 తేదీ నాడు హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లో పన్నీరు వ్యవహారంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ కావ్య కు ఎన్నిసార్లు ఫోన్



చేసినా ఫోన్ ఎత్తలేదని గతంలో కూడా ఈ అధికారిని ఫోన్ ఎత్తిన దాఖలాలు లేవని స్థానికులు, రిపోర్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారిని అయ్యుండి కూడా ఎఫ్ఎస్-ఎస్ఏఐ నిబంధనలు పాటించకుండా ఆటోలో ప్యాకింగ్ చేస్తున్న పన్నీరు కు తయారు తేదీ, గడువు తేదీ, నికర బరువు, బాక్స్ ప్యాకింగ్ లేని వాటికి చూసి కూడా సమర్థించడం వెనుక అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో అధికారుల జవాబుదారీతనం ఎక్కడ.? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత శాఖ ఉన్నతాధికారులపై ఉంది.

### ల్యాబ్ పరీక్షల్లోనూ పారదర్శకత కావాలి

కల్తీ పన్నీర్పై చర్యలు తీసుకోవాలంటే మార్కెట్లో అనుమానాస్పదంగా లభించిన అదే పన్నీర్ నమూనాలను సేకరించి సీలింగ్ చేసి, గుర్తింపు ప్రక్రియతో అధికారిక ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయాలి. అదే సమయంలో నమూనా సేకరణ నుంచి ల్యాబ్ రిపోర్టు వరకు మొత్తం ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. బ్రాండెడ్ కంపెనీల పన్నీర్ నమూనాలు మాత్రమే పరీక్షించి, వాటి నాణ్యత నివేదికలను స్థానికంగా తయారయ్యే అనుమానాస్పద పన్నీర్కు వర్తింపజేస్తున్నారా.? అన్న ఆరోపణలు నిజమైతే అది అత్యంత తీవ్రమైన విషయంగా పని నుంచి ఉన్నతాధికారులు ఇందుకు సహకరించిన అధికారులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలని ప్రజల కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది.

### పన్నీర్ మాఫియా వెనుక ఎవరు.?

టన్నుల కొద్దీ పన్నీర్ తయారీ, ప్యాకింగ్, రవాణా, హోటళ్లు




,,దుకాణాలకు సరఫరా జరుగుతుంటే అధికారుల నిఘా లేకుండా ఇది సాధ్యమా.? ఈ దందా వెనుక ఎవరున్నారు.? తయారీ కేంద్రాలకు అనుమతులు ఉన్నాయా.? లైసెన్సులు చెల్లుబాటులో ఉన్నాయా.? నాణ్యత పరీక్షలు జరిగాయా.? సరఫరా గొలుసులో ఎవరి పాత్ర ఉంది.? అనే అంశాలపై ఉన్నత అధికారులతో పూర్తి స్థాయి దర్యాప్తు చేయించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని హెచ్ ఫాస్ట్ అధికారులు సైతం ప్రజలు కోరుతున్నారు.కల్తీ పన్నీర్ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమైతే అది సాధారణ వ్యాపార అక్రమం కాదు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాలు ఆర్జించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా అధికారులు మౌనం వహిస్తే, ఆ మౌనం వెనుక కారణమేంటో కూడా ప్రజలకు చెప్పాల్సిందే అని ప్రజలు ఉన్నత అధికారులను కోరుతున్నారు. నగరంలో పన్నీర్ దందాపై డిజిపి సివి ఆనంద్, కమిషనర్ సజ్జనార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తయారీ కేంద్రాల నుంచి షాపుల వరకు తనిఖీలు చేసి, నమూనాలను స్వతంత్రంగా పరీక్షించి, ల్యాబ్ రిపోర్టులను బహిర్గతం చేయాలి. కల్తీ పన్నీర్ దందాకు తెరపడుతుందా.? లేక అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడుతుందా.? హెచ్ ఫాస్ట్ అధికారులు ఇటీవల దాడులలో పట్టుకుంటున్న కల్తీపై ప్రభుత్వం ఎంత సీరియస్ గా ఉందో ప్రజలకు తెలుస్తుంది కానీ కొంతమంది అధికారులకు తెలియక కల్తీ చేసే మాఫియాలకే సహకరించడం విడ్డూరంగా మారింది. దీనిపై సమాధానం చెప్పాల్సింది సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులే.

# పేరుకే అహ్మదిపూర్ ప్రభుత్వ ఆసుపత్రి.. రోగులకు అందని కనీస వైద్య సేవలు!

- నాలుగు నెలలుగా పనిచేయని సీబీపీ టెస్ట్ మిషన్.. గాయాలకు కుట్లు కూడా వేయలేని దుస్థితి
- పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్లకు పరుగులు.. వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలలుగా సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) పరీక్షల యంత్రం పనిచేయకపోవడంతో రోగులు తప్పనిసరిగా ప్రైవేట్ ల్యాబ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అహ్మదిపూర్ పీహెచ్సీ పరిధిలో ఏడు సబ్సెంటర్లు, 19 గ్రామాలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యం, పరీక్షలు, మందులు లభిస్తాయనే ఆశతో వచ్చే రోగులు, పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్లకు వెళ్లి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా, చిన్నపాటి గాయాలకు కూడా ఆసుపత్రిలో కుట్లు వేయలేని పరిస్థితి ఉండటంతో ప్రతి చిన్న చికిత్సకూ రోగులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని స్థానికులు తెలిపారు. దీంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని వారు వాపోతున్నారు.ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రులను ఏర్పాటు చేసినప్పటికీ, అవసరమైన పరికరాలు పనిచేయకపోవడం వల్ల సేవలు సరిగా అందడం



లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. వెంటనే సీబీపీ పరీక్షల యంత్రానికి మరమ్మతులు చేపట్టి పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆసుపత్రిలో అవసరమైన అన్ని వైద్య




సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### ల్యాబ్ టెక్నీషియన్ వివరణ:

సీబీపీ పరీక్షల యంత్రం గత మూడు నుంచి నాలుగు నెలలుగా పనిచేయడం లేదని, ఈ విషయాన్ని ఇప్పటికే సిద్దిపేట జిల్లా డీఎంహెచ్వో దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ల్యాబ్ టెక్నీషియన్ తెలిపారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

# వీడియో కాల్లోనే కడసారి చూపులు

- క్షీణిస్తున్న మానవ సంబంధాలపై సజ్జనార్ ఆవేదన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నేటి రోజుల్లో మానవ సంబంధాలు ఎంతగా దిగజారిపోతున్నాయో, చనిపోయాక చివరి చూపునకు కూడా నోచుకోలేకపోతున్నారు. చివరి క్షణాల్లో సాంకేతికత అందించే డిజిటల్ స్క్రీన్లు, ఆన్లైన్ మనీ ట్రాన్స్ఫర్లు కన్నపేగు అనుబంధానికి ప్రత్యామ్నాయం కాగలవా? అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశ్నించారు. ఆయన షేర్ చేసిన ఓ వీడియో నెటిజన్లను సైతం కదిలిస్తోంది. హరియాణాలోని సోనిపట్కు చెందిన ఒకప్పటి ప్రముఖ వ్యాపారవేత్త జీవిత చరమాంకంలో ఒంటరితనంతో కుమిలిపోతూ ఓ వృద్ధాశ్రమంలో కన్నుమూసిన ఘటనపై ఐపీఎస్ అధికారి వి.సి. సజ్జనార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు, అంతస్తులు సంపాదించి, పిల్లలను ఉన్నత స్థాయిలో నిలబెట్టిన ఆ తండ్రి చివరికి అనాథలా వైకుంఠ ధామానికి చేరడం నేటి సమాజంలో దిగజారుతున్న మానవ సంబంధాలకు, నైతిక విలువలకు సజీవ సాక్ష్యమన్నారు. కన్నతండ్రి కన్నుమూసినా కడసారి చూపునకు కూడా రాలేకపోయిన కుమార్తెలు, ఆఖరికి అంత్యక్రియలను మొబైల్ ఫోన్లో వీడియో కాల్ ద్వారా చూస్తూ సరిపెట్టుకోవడం అత్యంత దారుణం అన్నారు. తండ్రి చివరి కార్యక్రమాల ఖర్చుల కోసం కేవలం ?5,100 ఆన్లైన్లో పంపి తమ బాధ్యత తీరిపోయిందని భావించడం, నేటి సమాజంలో మనుషులు యంత్రాల్లా ఎలా మారిపోతున్నారో తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.మిమ్మల్ని ఈ లోకంలోకి తెచ్చి, మీ భవిష్యత్తు కోసం తమ జీవితాలనే ధారపోసిన కన్నతండ్రి ఆఖరి ప్రయాణంలో తోడుగా నిలబడలేని ఈ విలాసవంతమైన, వ్యాపారాత్మక బతుకులు ఎందుకని సజ్జనార్ ప్రశ్నించారు. కోట్లు సంపాదించినా, ఉన్నత హోదాల్లో స్థిరపడినా కన్నవారి రుణం తీర్చుకోలేని చదువులు, సంస్కారం ఏ పాటివని నిలదీశారు. చివరి క్షణాల్లో సాంకేతికత అందించే డిజిటల్ స్క్రీన్లు, ఆన్లైన్ మనీ ట్రాన్స్ఫర్లు కన్నపేగు అనుబంధానికి ప్రత్యామ్నాయం కాలేవని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు బతికున్నప్పుడు వారిని గుండెల్లో పెట్టుకుని ఆదరించడం, వారి ఆఖరి ఘడియల్లో తోడుగా నిలవడం




పిల్లలుగా ప్రాథమిక ధర్మమని హైదరాబాద్ సీపీ పిలుపునిచ్చారు. కన్నవారిని వృద్ధాశ్రమాలకు పరిమితం చేయడం, వారి మరణాన్ని కూడా వీడియో కాల్స్ ద్వారా చూస్తూ మమకారాలను తెంచేసుకోవడం మానవత్వానికే మచ్చ అని, ఇలాంటి స్వార్థపూరిత సంస్కృతిలో త్వరితగతిన మార్పు రావాలని ఆయన ఆకాంక్షించారు.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు

- ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అంశంపై ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటవుతుందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే దాని నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనని, అయితే ఆ భారం నేరుగా సాధారణ వినియోగదారులపైనే పడుతుందని ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మల్హోత్రా మాట్లాడుతూ యూపీఐపై ఎండీఆర్ అంశం ఇంకా ప్రారంభ దశలోనే ఉందన్నారు. ప్రభుత్వం చట్ట సవరణ ప్రక్రియలో ఉందని, తుది నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని చెప్పారు."వ్యవస్థ నిర్వహణకు ఖర్చు తప్పదు. ఆ ఖర్చును ఎవరో ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అది సాధారణ వినియోగదారుడే చెల్లిస్తాడని చెప్పలేం. పరోక్షంగా ఆర్థిక వ్యవస్థలోనే ఆ వ్యయం భరించే అవకాశం కూడా ఉంటుంది" అని మల్హోత్రా వివరించారు. ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 'పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్' చట్ట సవరణ బిల్లు ద్వారా యూపీఐ, రూపే వంటి డిజిటల్ చెల్లింపులపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశానికి చట్టపరమైన వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం నోటిపై చేసిన డిజిటల్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు లేదా చెల్లింపు సేవల సంస్థలు ఎండీఆర్ వసూలు చేయలేవు.ప్రతిపాదిత సవరణ అమల్లోకి వస్తే ఏ చెల్లింపు విధానాలకు ఛార్జీలు ఉండాలి, వేటికి మినహాయింపు ఇవ్వాలి అనే విషయాన్ని ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే అవకాశం ఉంటుంది. అయితే రోజువారీ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. రూ.2,000కు పైబడిన వ్యాపార చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారని, పాలు, కూరగాయలు, కిరాణా వంటి చిన్న మొత్తాల యూపీఐ చెల్లింపులు యథాతథంగా ఉచితంగానే కొనసాగే అవకాశముందని తెలిపాయి.ప్రస్తుతం క్రెడిట్, డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్ అమల్లో ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో ఆ వ్యయాన్ని వ్యాపారులే భరిస్తున్నారు. యూపీఐ విషయంలో కూడా తుది విధానం ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆర్బీఐ కూడా ప్రస్తుతం ఎలాంటి అధికారిక ప్రతిపాదనను ప్రకటించలేదని గవర్నర్ స్పష్టం చేశారు.

# భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్ఫామ్లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్ఫామ్ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్బుక్ పోస్ట్ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్ఫామ్లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సాయికృష్ణ డెత్ కేసు

- ముగిసిన సీఐ నాగరాజు సిట్ కస్టడీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీఐ నాగరాజు ఏడు రోజుల సిట్ కస్టడీ బుధవారంతో ముగిసింది. మరోవైపు, ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు కానిస్టేబుళ్లను ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించేందుకు సిట్‌కు విజయవాడ కోర్టు అనుమతి ఇచ్చింది. గత ఏడు రోజులుగా సిట్ అధికారులు సీఐ నాగరాజును విచారించారు. అయితే, సాయికృష్ణను ఎందుకంత క్రూరంగా హింసించారు, వ్యక్తిగత గొడవలు ఏమైనా ఉన్నాయా, మృతదేహం ఏమైంది? అనే కీలక ప్రశ్నలకు ఆయన నుంచి సరైన సమాధానాలు రాలేదని, చాలా వరకు విచారణకు సహకరించలేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. కస్టడీ గడువు ముగియడంతో, వైద్య పరీక్షల అనంతరం నాగరాజును అధికారులు తిరిగి కోర్టులో హాజరుపరచనున్నారు.ఇదిలా ఉండగా, ఈ కేసులో భాగమైన హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నాని, సాంబయ్యతో పాటు కానిస్టేబుల్ బాబూరావును సిట్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 5 నుంచి 9 వరకు ఐదు రోజుల పాటు వీరి విచారణ జరగనుంది. ప్రస్తుతం వేర్వేరు సబ్ జైళ్లలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సాయికృష్ణ అదృశ్యం, మృతదేహాన్ని మాయం చేయడం వంటి అంశాలపై వీరి నుంచి కీలక సమాచారం రాబట్టడమే లక్ష్యంగా సిట్ దర్యాప్తు కొనసాగించనుంది. కానిస్టేబుళ్ల విచారణకు కోర్టు పలు ముఖ్యమైన షరతులు విధించింది. విచారణ సమయంలో నిందితులను శారీరకంగా గానీ, మానసికంగా గానీ ఇబ్బంది పెట్టరాదని స్పష్టం చేసింది. మొత్తం విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్‌తో కూడిన సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో జరపాలని ఆదేశించింది. విచారణ పూర్తయిన తర్వాత ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు నలుగురినీ తిరిగి కోర్టులో హాజరుపరచాలని న్యాయస్థానం ఆదేశించింది. సీఐ విచారణ ముగియడం, కానిస్టేబుళ్ల విచారణ మొదలవ్వడంతో ఈ కేసులో దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588